ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 27 డిసెంబరు 2024 | 5





పర్యాటకులకు విజ్ఞానం.. వినోదం
» నెలాఖరుకు ప్రారంభం కానున్న యుద్ధ విమానం 6



రిజిస్ట్రేషన్లకు క్యూ

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూముల విలువ పెరుగుతుందనే సమాచారంతో రిజిస్ట్రేషన్లకు కక్షిదారులు బారులుతీరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ రిజిస్ట్రేషన్ కార్యాలయం చూసినా కిటకిటలాడుతున్నాయి. 2025 జనవరి 1వ తేదీ నుంచి భూముల విలువ పెరుగుతుండడంతో ప్రతి రోజూ క్యూకడు తున్నారు. గురువారం ఏకాదశి మంచి రోజు కావడంతో జిల్లా లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కక్షిదారుల పోటెత్తారు. సాధారణంగా కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సరాసరి 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. భూములు, స్థలాల ధరలు పెరుతాయని సమాచారం రావడం గురువారం భారీగా కక్షిదారులు తరలివచ్చారు. సుమారు 100 వరకు రిజిస్ట్రేషన్లకు దరఖాస్తుదారులు వచ్చారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి లాంచీలరేవు వరకు రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారి కార్లతో రహదారి నిండిపోయింది. రిజిస్ట్రేషన్లకు వచ్చినవారు ఉదయం నుంచి రాత్రి ప్రొద్దుపోయే వరకు రోడ్డుపైనే నిల్చుండిపోయారు. దీనికి తోడు సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో మధ్యాహ్నం 1 గంట సమయానికి 10 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. రిజిస్ట్రేషన్లు ప్రక్రియ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు కావొస్తుందని భావిస్తున్నారు.

పదోన్నతిపై వెళ్లిన వైద్యాధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు గురువారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వీరికి ప్రభుత్వం సీఎస్ఆర్ఎంవోలుగా ఇటీవల పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. డాక్టర్ రాజకుమారి కాకినాడ జీజీహెచ్‌కు సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతిపై నియమతులు కాగా, డాక్టర్ శ్రీహరిబాబు పలాస కిడ్నీ స్పెషాలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతి పొందారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, సహ అధికారులు, ఉద్యోగులు వారిని అభినందించారు.

గత నాలుగేళ్లుగా బిల్లులందక ఇక్కట్లు

కాంట్రాక్టర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు

చాగల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఇంకా బిల్లులు రాలేదని ప్రభుత్వ కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేడా వెంకట దుర్గాప్రసాద్ అన్నారు. చాగల్లులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా బిల్లులు చెల్లింపులు జరగక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్ల పట్ల దయతో వ్యవహరించి బిల్లులు చెల్లించాలని కోరారు.కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు బకాయిలు ఉండడం వల్ల అభివృద్ధి పనులు ముం దుకు సాగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీఎస్పీ ప్రాంతీయ కార్యాలయం మార్పు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రత్యేక రక్షణ దళం ప్రాంతీయ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం నారాయణపురంలో ఏర్పాటు చేసినట్టు ఏపీఎస్పీ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు తెలిపారు. నూతన కార్యాలయం వద్ద గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సర్వమత ప్రార్థనలు చేసి ప్రారంభించారు. నారాయణపురం నాగమ్మతల్లి గుడి వెనుక ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కమాండెంట్ పీవీఎస్ ఏడీ ప్రసాదరావు, డి.గంగరాజు పాల్గొన్నారు.

కొత్తతుంగపాడులో బాల్యవివాహం కలకలం

దివాన్‌చెరువు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామంలో బాల్యవివాహం జరిగిందన్న సమాచారం మేరకు అధికారులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అధికార్లు వెనుదిరిగారు. కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన యువకుడు(27) అదే గ్రామానికి చెందిన బాలిక (16) తో బుధవారం రాత్రి వివాహం జరిగిందని సమాచారం అందుకున్న అధికారులు గురువారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. అయితే తమకు సంబంధం లేదంటూ ఇరువర్గాల పెద్దలు తప్పించుకునే ప్రయత్నం చేశారు.తమకు అందిన సమాచారం వాస్తవం అని తేలడంతో ఆ గ్రామానికి వెళ్లిన అధికార్లు బృందం నూతన వధూవరుల కోసం ప్రయత్నించారు. బాలిక 9వ తరగతి వరకూ చదివి మానివేసినట్టు వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నట్టు తెలిసిందన్నారు. వివాహమైన తరువాత వారు తిరుపతి వెళ్లారని అధికారులు చెప్పారు. వారు తిరిగి వచ్చిన వెంటనే తమ వద్దకు తీసుకురావాలని వధూవరుల బంధువులకు చెప్పి అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.ఈ విషయంలో బాలిక తల్లిదండ్రులు తమకు సహకరించలేదంటూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాసరయ్య మాట్లాడుతూ గ్రామంలో బాల్యవివాహాల నిరోధక కమిటీ ఉన్నప్పటికీ వారు తగిన రీతిలో స్పందించడం లేదని వాపోయారు.



అక్రమార్కులను మట్టి కరిపిస్తారా..?: పోలవరం కాలువ గట్టుపై కరిగిపోయిన మట్టి మేటలు

మహా మేతలు!

పోలవరం మట్టినీ మింగేసిన వైసీపీ నేతలు

- రూ.350 కోట్లు హాంఫట్
- అక్రమార్కులపై కానరాని చర్యలు
- ప్రభుత్వం మారినా అదే తీరు
- విజిలెన్స్ విచారణకూ దూరం
- కాలవ గట్టుపై మట్టి మాయం
- పేదల స్థలాల చదును ముసుగు
- భారీగా అక్రమ మట్టి తవ్వకాలు
- రియల్‌ఎస్టేట్‌కు విక్రయాలు
- లేఅవుట్లకు తరలింపు
- కొమరగిరిలో రూ.6 కోట్లు
- కోట్లకు పడగలెత్తిన నేతలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల కోట్ల విలువైన పోలవరం మట్టిని మింగేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అప్పట్లో పేదల ఇళ్ల స్థలాలకు పోలవరం మట్టిని తవ్వి తరలించడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు తాత్కాలిక అనుమతులివ్వగా.. ఆ ముసుగులో మొత్తం మట్టంతా మింగేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు తెర వెనుక ఉండి సాగించిన దందాతో కోట్లకు కోట్లు కూడబెట్టారు. అదే సమయంలో గనుల శాఖకు రాయల్టీ సైతం చెల్లించకుండా పంగనామాలు పెట్టేశారు. ఒకరకంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడింది. ప్రభుత్వం మారడంతో అక్రమార్కులపై చర్యలు తప్పవని అంతా భావించారు. కూటమి సర్కారు గద్దెనెక్కినా విజిలెన్స్ విచారణకు అతీగతీ లేకుండాపోతోంది. ఎందుకో తెలియదుగానీ అధికారుల నుంచి ప్రభుత్వానికి నివేదికలు పంపకుండా తాత్సారం జరుగుతోంది. ఇప్పటికే కాకినాడ కేంద్రంగా గడచిన ఐదేళ్లలో చోటు చేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలు, టీడీఆర్ బాండ్లలో కోట్లు కొట్టేసిన దొంగలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ అదే స్థాయిలో రూ.350 కోట్లకుపైగా మట్టిలో మెక్కేసిన దొంగలపై అసలు విచారణ దిశగా అడుగులు పడకపోవడంతో అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

మట్టంతా మింగేశారంతే..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వంద కిలోమీటర్లమేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా వెళుతోంది. గతంలో ఈ కాలువను 18మీటర్ల లోతుకు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటిని కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో పోగేశారు. అయితే వైసీపీ రాక ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దీనివైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. వేసిన మట్టిదిబ్బలు వేసినట్టే ఉన్నాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీ నేతలు మట్టిపై గద్దల్లా వాలిపోయారు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయించేశారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని గడచిన ఐదేళ్లలో అనుమతులతో సంబంధం లేకుండా గుట్టు చప్పుడుకాకుండా పదుల సంఖ్యలో పొక్లెయినర్లు పెట్టి వేలాది టిప్పర్లతో తరలించేశారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయ రహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మేటలు, తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీన్నంతటిని అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని తవ్వాలంటే జలవనరుల శాఖ, గనుల శాఖకు డబ్బులు చెల్లించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధన లేవీ పని చేయకపోవడంతో ఎవరికివారు మట్టితో కోట్లు కొల్లగొట్టారు. గనులు, జలవనరులశాఖాధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 90 శాతానికిపైగా మాయమైపోయింది. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమై పోయింది. ముఖ్యంగా ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల పరిధిలో కొండలు, గుట్టల మీదుగా పోలవరం కాలువ తవ్వడం వల్ల ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ మట్టి పోగైంది. గడచిన ఐదేళ్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల హోదాలో పర్వత ప్రసాద్, దాడిశెట్టి రాజాకు చెందిన అనుచరులు పోలవరం మట్టితో రెండు జేబులూ నింపేసుకున్నారు.

రూ.350 కోట్లు వస్తాయని లెక్క..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖజానాకు నిధులు సమకూర్చడం కోసం ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో 12కోట్ల క్యూబిక్‌మీటర్ల పోలవరం మట్టిని విక్రయించి రూ.900 కోట్ల ఆదాయం రాబట్టాలని 2019లో భావించింది. ఈ మేరకు మంత్రుల కమిటీ ఏర్పాటుచేసి అంచనా వేయించింది. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరిలోనే మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని అధికారులు లెక్కగట్టారు. మట్టిని విక్రయించడానికి వీలుగా రాష్ట్ర గనులశాఖ పరిధిలోకి పోలవరం కాలువలను తీసుకురావాలని అప్పట్లో మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఆ తర్వాత వేలం విషయం ప్రభుత్వం మర్చిపోయింది. దీంతో ఐదేళ్లలో వైసీపీ నేతల దోపిడీతో మట్టి ద్వారా ఖజానాకు రావలసిన కోట్లు నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో పోలవరం మట్టి మేతపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. పైగా అసెంబ్లీలోను మట్టి మాఫియా అంశంపై చర్చ జరిగింది. కానీ ఇప్పటివరకు విజిలెన్స్ అధికారులు విచారణకు రంగంలోకి దిగలేదు. పోలవరం మట్టి మాయం ద్వారా గనులశాఖ రాయల్టీ ఆదాయానికి గండిపడిందనే కోణంలో దర్యాప్తు జరుగుతుందని అధికారులు చెప్పినా, ఇంతవరకు అసలు ఉలుకుపలుకూ లేదు. ఇప్పటికే కాకినాడలో రేషన్ మాఫియా అంతు తేల్చడానికి ప్రభుత్వం సిట్‌ను నియమించి దర్యాప్తు చేయిస్తోంది. కాకినాడలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోలవరం మట్టి అక్రమాలపైనా విజిలెన్స్‌తో విచారణ చేయించాల్సిన అవసరం ఉంది.

మట్టి మింగేశారిలా..

పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్ల స్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతి సమీపంలో ఉండడంతో చిన్నపాటి వర్షాలకు ముంపునకు గురవుతాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదునుచేశారు. ఇందుకు గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని వేలాది టిప్పర్లలో కొన్ని వారాలపాటు తరలించారు. ఈ లేఅవుట్ చదునుకు ఎంత పరిమాణంలో పోలవరం మట్టి తరలించాలనే దానిపై అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ చదును ముసుగులో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో పోలవరం మట్టి తరలించారు. వాస్తవానికి పోలవరం మట్టిని ఇళ్ల స్థలాల అవసరాలకు ప్రభుత్వం తాత్కాలిక అనుమతులు ఇచ్చినప్పుడు రోజుకు ఎన్ని టిప్పర్లు మట్టి తరలిస్తున్నారు? అసలు ఎంత తవ్వుతున్నారు? వంటి వివరాలు అధికారులు లాగ్‌బుక్‌లో నమోదుచేయాలి. కానీ అప్పట్లో ఇదేదీ జరగలేదు. తవ్వుతున్న మట్టిలో ప్రభుత్వ అవసరాలకు ఎంత వెళ్తుంది? రియల్ ఎస్టేట్ అవసరాలకు ఎంత పంపుతున్నారనేది పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో కాకినాడ కీలక నేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.



పేపరు మిల్లు కార్మికుల ఆ..వేతన!

వేతనం పెంచాలని కార్మికుల డిమాండ్

- రూ.10,500 పెంచాలని డిమాండ్
- రూ.3,500లకే కంపెనీ ఆమోదం
- ఒప్పుకోని కార్మికులు
- ఎటూ తేల్చని యాజమాన్యం
- కూటమి నాయకుల చర్చలు
- ఇప్పటికే రెండు సార్లు సమావేశం
- అయినా మారని తీరు
- కార్మికుల సమ్మె యోచన
- సీఎం చంద్రబాబు దృష్టికి సమస్య

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కార్మికుల వేతన ఒప్పందం చిలికి చిలికి గాలి వాన మాదిరిగా మారింది. ప్రస్తుతం పేపరుమిల్లు కోట్లాది రూపాయల లాభాల్లో ఉన్నా యాజమాన్యం మాత్రం కార్మికుల వేతన ఒప్పందం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. 2019లో జరిగిన వేతన ఒప్పందంలో మిల్లు యాజమాన్యం పర్మినెంట్ కార్మికుడికి రూ.9 వేలు పెంచే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ అగ్రిమెంట్ 2020 జూన్ 1తో ముగిసింది. అప్పటి నుంచి 31వ తేదీ డిసెంబరు 2023 వరకు వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా దానిని యాజమాన్యం నిర్లక్ష్యం చేసింది. వేతన ఒప్పందం గడువు దాటి ఏడాది పూర్తయినా కార్మికులు డిమాండ్‌ను నిర్లక్ష్యం చేస్తూ యాజమాన్యం మొండివైఖరి అవలంభిస్తోంది.

2,728 మంది కార్మికులు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లులో 728 మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. 1972 నుంచి 2019 వరకు 14 వేతన ఒప్పందాలు జరిగాయి. కార్మికుల కష్టంతో ఫ్యాక్టరీ 1300 కోట్ల రూపాయల లాభాల్లో ఉన్నా యాజమాన్యం కార్మికుల డిమాండ్‌ను పట్టించుకోవడంలేదు.కార్మికుల డిమాండ్ ఆమోదిస్తే వేతనాల ద్వారా రూ.36 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. దీంతో మిల్లు లాభాల బాటలో ఉంటే కార్మికులు కష్టాల బాటలో ఉన్నారు.

యజమానుల దోబూచులాట

ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు నూతన వేతన ఒప్పందంపై 14 కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నాయి. మిల్లు యాజమాన్య వైఖరికి నిరసనగా సమ్మెకు దిగాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యాజమాన్య ప్రతినిధుల మధ్య చర్చల నేపథ్యంలో సమ్మెను విరమించి విధులకు హాజరవుతున్నారు.ఇదిలా ఉండగా మంత్రి దుర్గేష్ నాలుగు నెలల కిందట కార్మికులు, అధికారులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మికశాఖ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు.14 కార్మిక సంఘాల ప్రతినిధులు మిల్లు కార్మికులకు రూ.10,500 వరకూ పెంచాలని డిమాండ్ చేశాయి.ఈ సమావేశానికి హాజరైన మిల్లు ఈడీ ముఖేష్ జైన్ కార్మికులకు రూ.3250 పెంచుతామని చెప్పారు. అప్పుడు దీనిపై చర్చ జరగ్గా తదుపరి సమావేశానికి ఒక కొలిక్కి రావాలని నిర్ణయించారు.ఈ నెల 24న కలెక్టరేట్‌లో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి,బత్తుల బలరామకృష్ణ ,అసిస్టెంట్ లేబర్ కమిషనర్ల సమక్షంలో మిల్లు కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో రెండో సారి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఈడీ ముఖేష్ జైన్ పాల్గొనలేదు.ఆయన తరఫున హాజరైన ప్రతినిధులు రూ.3500 పెంచుతామని ప్రకటించారు. దీనిని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. మిల్లు యాజమాన్యం 2019లో చేసి అగ్రిమెంట్‌ను నూతనంగా చేసే వేతన ఒప్పందానికి కలుపుకుని కార్మికుడికి రూ.12,500 వరకు పెంచినట్టుగా ఉంటుందనే లెక్కలను కట్టారు.కార్మిక సంఘాలు, మంత్రి, ప్రజాప్రతినిధులు వాటిని వ్యతిరేకించాయి. కార్మిక సంఘాలు రూ.10,500 పెంచాలని డిమాండ్ చేశాయి.మిల్లు యాజమాన్యం మాత్రం వేతన ఒప్పందంలో కార్మికులు..పాలకులతో దోబూచులాడుతుంది.ఈ సమస్య ఇప్పుడు సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. అతి త్వరలో సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

యాజమాన్యం మొండివైఖరి వీడాలి

కార్మికుల కష్టంతో లాభాల బాటలో ఉన్న పేపరుమిల్లు యాజమాన్యం అదే కార్మికులు వేతన ఒప్పందంలో మొండి వైఖరితో ఉండడం చాలా దుర్మార్గం.కార్మికులు ఏడాదిగా వేతన ఒప్పందం కోసం వేచి చూస్తున్నారు. సమ్మెలోకి వెళ్లినా పట్టించుకోకపోడం దారుణం. కార్మికుల డిమాండ్ మేరకు వేతన ఒప్పందం లేకపోతే ఉద్యమం తప్పదు.
- అరుణ్, సీఐటీయూ, రాజమహేంద్రవరం

రూ.10,200లకు ఓకే..

ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందంపై కాలయాపన చేయడాన్ని ఖండిస్తున్నాం.గత సమావేశంలో ఈడీ ముఖేష్ జైన్ రూ.3250 పెంచుతామన్నారు. ఈ నెల 24న సమావేశంలో కేవలం రూ.250 మాత్రమే పెంచి రూ.3500 ఇస్తామనడం సరికాదు. కార్మికులు దానికి ఒప్పుకోరు. కార్మికులు రూ.10,200 ఇస్తే అంగీకరిస్తారు.
- ఎ.జగన్నాథరావు, మిల్లు కార్మిక నేత

డిజిటల్ అరెస్టుల్లేవ్

సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

- జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు
- మార్చి నాటికి ఏర్పాటు
- 37 బ్లాక్‌స్పాట్ల గుర్తింపు
- సైబర్ నేరాలపై డయల్ 1930
- జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్



కొవ్వూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కొవ్వూరు/చాగల్లు,డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మార్చి నాటికి 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు.కొవ్వూరురూరల్ సీఐ కార్యాలయం, చాగల్లు, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో గురువారం వార్షిక తనిఖీ నిర్వహించి మాట్లాడారు.జిల్లా పరిధిలో ట్రాఫిక్‌కు సంబంధించి 37 బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో నిద్ర మత్తు, సరైన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు.ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు ఫేస్ వాష్ వంటి కార్యక్రమాలు పెట్టామన్నారు. హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.జిల్లాలో 7 హైవే పెట్రోలింగ్ వాహనాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నల్లజర్ల నుంచి రాజానగరం వరకు హైవేపై 3 పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1800 నిఘా కెమెరాలు ఉన్నాయని.. 2025 మార్చి నాటికి జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. గతంతో పోల్చితే జిల్లాలో క్రైమ్ రేటు తగ్గిందన్నారు. జిల్లాలో మహిళల భద్రతకు మహిళా రక్షక్ అని వాట్సాప్ యాప్ ఏర్పాటు చేశామన్నారు. హత్య,చోరీ కేసుల్లో ఉన్నవారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామన్నారు. డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సర వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. మద్యం షాపులు, బార్లు నిర్ణీత సమయానికి మూసివేయాలన్నారు.రాత్రి సమయాల్లో మద్యం సేవించి తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బైక్‌ల సైలెన్సర్లు తీసి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా తిరిగితే చర్యలు తప్పవన్నారు. సైలెన్సర్ల డ్రైవ్ చేపడతామన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్నవారు, గతేడాది కోడి పందాల్లో పట్టుబడిన వారిని ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామన్నారు. గంజాయి నివారణకు అందరూ కలిసి పోరాడదామన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టు అంటున్నారు, అటువంటిది ఏమీ లేదన్నారు. సైబర్ సమస్య వస్తే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగినా 112 నెంబరుకు సమాచారం అందజేయాలన్నారు. కొవ్వూరురూరల్ సీఐ కార్యాలయం భవనం పాతది కావడంతో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదన చేస్తున్నామన్నారు. జిల్లాలో పోలీస్ స్టేషన్ల విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థలం సేకరించి సొంత భవనాలు నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. ఆయన వెంట సీఐలు కె. విజయ్‌బాబు, పి.విశ్వం,ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐలు కె.శ్రీహరిరావు, కే.నరేంద్ర పాల్గొన్నారు.

నేడు ఏలూరులో ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఏకసభ్య కమిషన్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడానికి నియమించబడిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించారు.ఈ మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత ఉపసంచాలకులు ఎంఎస్ శోభారాణి ఒక ప్రకటన విడుదల చేశారు.కమిషన్‌కు వినతులను ఒరిజనల్ పత్రాలతో ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి మీటింగ్ హాలులో ఉదయం పది గంటలకు ఏకసభ్య కమిషన్‌కు సమర్పించవచ్చని శోభారాణి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

ప్రియురాలిని మర్చిపోమన్నారని..
యువకుడి ఆత్మహత్య 8

క్రిస్మస్ పండగ పూట
పాస్టర్‌పై పోక్సో కేసు 7

పర్యాటకులకు.. వినోదం.. విజ్ఞానం



కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సందర్శకులకు విజ్ఞానం పంచనున్న యుద్ధ విమానం



సాయం సమయాన.. సాగరతీరాన.. ఆహ్లాదకర వాతావరణంలో గడపాలంటే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు వెళ్లాల్సిందే.. అక్కడి అందాలను తిలకించడానికి విచ్చేసే పర్యాటకులకు ఇకపై యుద్ధ విమానం మ్యూజియం స్వాగతం పలకనుంది. భారత నావికాదళానికి రక్షణ రంగంలో 28 ఏళ్లపాటు సేవలందించిన టీయూ-142 యుద్ధ విమానం మ్యూజియం జిల్లావాసులకు కనువిందు చేయనుంది. అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెలాఖరులోపు సందర్శకులకు మ్యూజియాన్ని తిలకించేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఈ విమాన మ్యూజియంపై ప్రత్యేక కథనం.

- నెలాఖరుకు ప్రారంభం కానున్న టీయూ 142 యుద్ధ విమానం
- వినియోగంలోకి రానున్న ఎన్టీఆర్ బీచ్ యుద్ధ విమాన మ్యూజియం

(ఆంధ్రజ్యోతి-సర్పవరం జంక్షన్)

ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దేశ రక్షణ, భద్రత కోసం భారత త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులు, సందర్శలకు విజ్ఞానం, వినోదం పంచేందుకు ఎన్టీఆర్ బీచ్‌లో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. అక్టోబరు, 2020లో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ (గుడా) రూ.5.89 కోట్ల నిధులతో టీయూ-142 ఎం యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బిల్లుల మంజూరులో జాప్యం, అసంపూర్తి నిర్మాణ పనుల కోసం రూ.9.03 కోట్లతో ఇతర చిల్డ్రన్స్ పార్కు, బ్యూటిఫికేషన్, విద్యుదీకరణ తదితర పనులు చేపట్టారు. యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే ఎన్నికల ముందు జనవరి 2024లో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించారు. మ్యూజియం చుట్టూ గ్రీనరీ, బ్యూటిఫికేషన్, చిన్నారుల పార్కు, విద్యుద్ధీకరణ తదితర నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో యుద్ధ విమాన మ్యూజియం సందర్శకులకు అందని ద్రాక్షలా మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కృషితో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, నగర పాలక సంస్థ కమిషనర్, కౌడా ఇన్‌చార్జి వీసీ భావన చొరవతో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులు పూర్తి చేశారు. డిసెంబరు నెలాఖరు నాటికి దీన్ని సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రధాన ఆకర్షణగా మ్యూజియం

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో విశేష సేవ లు అందించింది. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి సుదీర్ఘకాలం సేవలు అందించింది. సముద్ర తీరంలో గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో తరుపు ముక్కగా పేరు గాంచింది. ఇది 2017లో నేవీ నుంచి ఈ యుద్ధవిమానం తప్పుకుని తమిళనాడు అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచ దేశాలను 16 గంటల్లో చుట్టి వచ్చే సామర్థ్యం దీని సొంతం. గంటకు 925 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం విశేషం. ఈ పురాతన యుద్ధ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరోస్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చి మ్యూజియంలో పొందుపరిచింది. విమానంలోకి ప్రవేశించే ముందు లోపలనుంచి వివిధ పరికరాలు, విమాన భాగాలను తిలకించవచ్చు. సోనా బాయ్స్, ప్రొపెల్లర్, ఇంజన్, సర్వేకల్ కిట్, యాంటీ జలాంతర్గమి క్షిపణి, డేట్ రికార్డర్ పరికరాలు, విమానంలోనికి ఎక్కేందుకు ఫ్లైట్ సిమ్యులేటర్ ప్లాట్‌ఫారం ఉంది. యుద్ధ సమయంలో విమానాలను వినియోగించే తీరు, ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు. విమాన టేకాఫ్, దేశానికి అందించిన సేవలు వివరాలు తెలిపే ల్యాండింగ్ డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానం అందించనున్నారు.

పూర్తిస్థాయిలో మ్యూజియం రెడీ

యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. విమానం లోపల విద్యుద్దీకరణ, ఏసీ పూర్తి చేశాం. ప్రాంగణంలో చిన్నారులకు వినోదం పంచేందుకు పచ్చదనంతోపాటు పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఎన్టీఆర్‌బీచ్ నుంచి యుద్ధ విమాన మ్యూజియానికి స్వాగతం పలికేలా స్వాగత ద్వారం ఏర్పాటు చేశాం. ప్రవేశ ద్వారం నుంచి విమాన మ్యూజియం వరకు ఇరువైపులా రహదారిని అందంగా తీర్చిదిద్దాం. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్, కౌడా వీసీ, కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరుకు మ్యూజి యం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నాం.

-జి.శ్రీనివాస్, కౌడా ఏఈ, కాకినాడ

పచ్చదనం ఉట్టిపడేలా పార్కు

ఈ మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటుచేశారు. చిన్నారులు, పెద్దలు, యువతను ఆకట్టుకునేలా పచ్చదనం, వివిధ రకాల వెజిటబుల్స్ పండ్లు, ఉడ్ కర్రలు అందంగా ఏర్పాటుచేశారు. చిన్నారుల పార్కులో 2009లో సర్వీసులో రిటైర్‌మెంట్ తీసుకున్న హెచ్‌పీటీ-32 విమానాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్. పైలట్లకు శిక్షణ ఇచ్చే చిన్న విమానం. దీన్ని యుద్ధ విమాన మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.



సిద్ధమైన పార్కుప్రాంగణం



హెచ్‌పీటీ-32 ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్



ఆలమూరు వద్ద గోదావరి విహరిస్తున్న అరుదైన బార్ హెడెడ్ గుస్ బాతులు

గోదావరిలో అరుదైన అతిథులు

- భూమికి మూడు వేల అడుగుల ఎత్తులో ఎగిరే పక్షులుగా గుర్తింపు
- హిమాలయాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన అతిథులు
- కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరిలో పక్షుల సందడి

ఆలమూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూమికి అత్యంత ఎత్తులో ప్రయాణించే పక్షులుగా గుర్తింపు పొందిన బార్‌హెడెడ్ గుస్ బాతులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరి తీరాన సందడి చేశాయి. హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన పక్షులుగా ఈ బాతులకు మంచి గుర్తింపు ఉంది. భూమికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో ఎగరడం వీటి ప్రత్యేకత. శీతాకాలంలో కోసిన వరిపొలాలు, చిత్తడి నేలలు వీటికి ఆవాస క్షేత్రాలుగా విలసిల్లుతాయని ప్రముఖ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఉప్పలూరి సురేష్‌కుమార్ తెలిపారు. రోజుకు వందల కిలోమీటర్ల మేర ప్రయాణం చేయడం వీటి ప్రత్యేకత. సాధారణంగా నవంబరులో రావాల్సిన ఈ పక్షులు ఈసారి ఆలస్యంగా డిసెంబరు నెలలో కనిపించినట్టు వివరించారు. ఉప్పునీటి కయ్యలు, మంచినీటి కయ్యలు, నదీతీరాలకు వీటి రాక ఉంటుందని... అయితే ఆలమూరు మండలంలో ఇవి కనిపించడం ఆనందం కలిగించే విషయమని చెప్పారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు 'తరపట్ల'



సత్యనారాయణ (పాత చిత్రం)

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల సభలకు తాను విశిష్ట అతిథిగా హాజరవుతున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. విద్యారంగ ప్రతినిధుల సభలో పాల్గొని 'కనుమరుగవుతున్న మన జానపద కళా సంపద పరిరక్షణ-ప్రణాళికలు' అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. ప్రపంచ వేదికలపై మనగొంతు వినిపించాలని, అదొక గొప్ప సందేశం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తరపట్లకు నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిర్మయి అభినందనలు తెలిపారు.



ఒడిశా రైతులకు మొక్కల గురించి వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సుధీర్‌కుమార్

పూల పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా రైతులు

కడియం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలోని పూల పరిశోధనా ప్రాంతీయ కేంద్రాన్ని గురువారం ఒడిశా రాష్ట్రం గంజాం రైతులు సందర్శించారు. పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డీవీఎస్ రాజు పూల సాగు ప్రాధాన్యం, పూల పంటల్లో ఆశించే తెగుళ్లు, చీడపీడలు వాటి నివారణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఫ్లోరికల్చర్ రీసెర్చ్ కేంద్రం శాస్త్రవేత్త మాధవన్ పూలమొక్కల్లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణను వివరించారు. అనంతరం రైతుల బృందం కడియపులంక మల్లు పోలరాజు, గంగుమళ్ల సత్యనారాయణ నర్సరీలను సందర్శించింది. కడియం నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు, రైతుల కృషి, నర్సరీల అభివృద్ధి తదితర విషయాలను రైతులు వివరించారు. కార్యక్రమంలో మల్లు పోలరాజు, గంగుమళ్ల తాతాజీ, ఉద్యానవన శాఖ అధికారి డి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తాం

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

గొల్లప్రోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను ఆర్థికంగా పరిపుష్టి చేయడంతో పాటు రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆవరణలో గురువారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల పనితీరు, వాటి బలోపేతానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, రైతుల అవసరాల ఏమిటి తదితర విషయాలు తెలుసుకుని తదనుగుణంగా బలోపేతం చేసేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవసరం మేరకు వివిధ రంగాల్లో నూతన సొసైటీలు ఏర్పాటు చేస్తామన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసి అన్ని రంగాల్లోకి విస్తరించేలా రాష్ట్రాల సహకారంతో కేంద్రం చర్యలు చేపడుతోందని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు మహేష్, సూపర్‌వైజరు గోవిందు, సొసైటీ సీఈవో సూరిబాబు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు సర్వం సిద్ధం

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేటి నుంచి మహిళా నేషనల్ ఇన్విటేషన్ బీచ్ వాలీబాల్ టోర్నమెంటు

నిబంధనల మేరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు... ప్రారంభోత్సవానికి హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు

ఎనిమిది రాష్ట్రాల క్రీడాకారిణులు రాక

తీరంలో 20 మంది గజ ఈతగాళ్లు



ఎస్.యానాం సముద్ర తీరాన నేషనల్ బీచ్ వాలీబాల్ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం, సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టెక్నికల్ టీమ్



ఉప్పలగుప్తం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఈ నెల 27 నుంచి 29 వరకు డే అండ్ నైట్ నేషనల్‌ఇన్విటేషన్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలకు క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో భాగంగా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వాలీబాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డై అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. అమలాపురం డీఎస్పీటీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ చలమల రాజేష్ క్రీడా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యేతో చర్చించారు. క్రీడా ప్రాంగణంలో టెక్నికల్ టీమ్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. సముద్ర తీరాన 20 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం వివరించారు. టోర్నీని తిలకించేందుకు వచ్చే క్రీడాభిమానులకు అనుగుణంగాభద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కీలక ప్రదేశాల్లో పోలీసులను నియమిస్తామన్నారు.

ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవచ్చు ఇలా..

అమలాపురం, రాజమహేంద్రవరం వైపుల నుంచి వచ్చే క్రీడాభిమానులు అమలాపురం నుంచి నేరుగా ఎస్.యానాం బీచ్‌కు రావచ్చు. కాకినాడ నుంచి వచ్చేవారు పల్లంకుర్రు రూట్లో కాట్రేనికోన నుంచి ఆర్అండ్‌బీ రహదారిలో నేరుగా ఎస్.యానాం రావచ్చు. ప్రధాన గ్రామం నుంచి బీచ్ వరకు మూడు కిలో మీటర్ల మేర సీసీ రహదారి వేశారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు

ప్రతిరోజు ఆరు మ్యాచ్‌లు నిర్వహిస్తాం

గొలకోటి ఫణీంద్రకుమార్, వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్, గుజరాత్, గోవా, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బెంగాల్, వేల్స్ యూనివర్సిటీ మహిళా జట్లు టోర్నమెంటులో పాల్గొంటున్నాయి. ప్రతిరోజూ ఆరు మ్యాచ్‌లు జరిగేలా ఏర్పాట్లు చేశాం. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయి. టెక్నికల్ టీమ్ సహకారంతో క్రీడా ప్రాంగణాన్ని అధునాతన విధానంలో సిద్ధం చేశాము. క్రీడాభిమానులు కూర్చుని చూసేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశాము.







బాటిల్‌తో చేపల వేటలో పాల్గొన్న మత్స్యకార యువకులు, తిలకిస్తున్న జనం.. చిక్కిన చేపలు

బాటిల్‌తో చేపల వేట!

- గోదావరిలో భారీగా చిక్కుతున్న చేపలు
- వైరల్ అవుతున్న వీడియోలు

యానాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చేపల వేటలో యానాంకు చెందిన మత్స్యకార యువకులు కొత్త ఒరవడ సృష్టిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తూర్పుగోదావరి జిల్లాలో అంతర్ భూభాగంగా ఉన్న కేంద్రపాలితప్రాంతమైన యానాం పర్యాటకంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ గోదావరి కలిసే సముద్ర ముఖద్వారం కావడంతో అరుదైన మత్స్య సంపద దొరుకుతుంది. ఈ సంపద యానాం మత్స్యకారులు వేటకు చిక్కడంతో వాటిని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటలను వివిధ రకాల వలలు, గేలాల ద్వారా చేస్తుంటారు. అయితే ప్రస్తుతం యానాం మత్స్యకార యువకులు చేపలు పట్టడంతో కొత్త ఒరవడి అనుసరిస్తున్నారు. యానాం కనకాలపేట సమీపంలోని పుష్కర్ ఘాట్ వద్ద గల గోదావరిలో ఎప్పటిలా కాకుండా నూతన నిధానంలో చేపల వేట నిర్వహించారు. ఒక లీటర్ వాటర్, డ్రింక్ బాటిల్‌ను సగానికి కట్‌చేసి వాటికి నాలుగు వైపులా తాడుకట్టి వాటిలో మైదా పిండివేసి గోదావరిలోకి విసురుతున్నారు. బాటిల్‌లోని మైదాపిండి తినేందుకు వచ్చిన చేప (కొయ్యింగ మాత్రమే) వాటిలో ఇరుక్కుపోతోంది. వాటిని పైకి లాగుతారు. గత మూడు రోజులుగా ఈ వేట కొనసాగుతోంది. లైవ్‌ఫిష్ దొరుకుతున్నాయని ఆనోటా ఈనోట తెలియడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది. కొందరు కొనుగోలు చేసుకుని ఇంటికి పట్టుకెళ్తున్నారు.

రహదారి భద్రతపై ప్రజా చైతన్య యాత్ర



బైక్ యాత్ర బృందం సభ్యులు

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ప్రయాణించే సందర్భంలో భద్రత చాలా ముఖ్యమని, ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేసేందుకు తాము యాత్రసాగిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరేష్ తెలిపాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్, ఒక ఫార్మాసిస్ట్, మరో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేపట్టిన బైక్ యాత్ర గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు చేరింది. డాక్టర్ వెంకట్ కోసూరి, డాక్టర్ పిన్నింటి నరేష్, బి.వంశీ, కరణం కృష్ణచైతన్య, బాలాంత్రపు శ్రీకృష్ణ, డేనియల్ బెన్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభించామని... మచిలీపట్నం, దిండి, యానాం, కాకినాడ, భీమవరం, బాపట్ల మీదుగా హైదరాబాద్ చేరుకుంటామన్నారు. యాత్ర తొమ్మిది రోజులు సాగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, గ్లౌజ్‌లు, జాకెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా స్వల్ప గాయాలతో బయటపడవచ్చన్నారు. ఏపీలోని అందాలను తమ హెల్మెట్లలో అమర్చిన కెమెరాల్లో రికార్డు చేసి ఇన్‌స్ట్రాగామ్, యూట్యూబ్ ద్వారా ప్రజలకు చూపిస్తామని వివరించారు.

పుంగనూరు దూడ.. అడుగున్నరే..



పి.గన్నవరం,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో జెర్సీ పుంగనూరు ఆవు అడుగున్నర ఎత్తుతో పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. ఈ దూడ ఎత్తు, పొడవు తక్కువగా ఉండడంతోపాటు బూడిద రంగులో ఉండడంతో స్థానికులు ఆ సక్తిగా తిలకిస్తున్నారు. ఇది టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుకు సంబంధించినపశువులశాలలో జన్మించింది.

ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు..

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలు



ముహూర్తపు పత్రాన్ని ఆలయ ఏసీకి అందిస్తున్న అర్చకులు

» 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు సుముహూర్తం

అంతర్వేది, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు అర్చకులు ముహూర్తం ఖరారు చేశారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13 వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సుముహూర్తం నిర్ణయించి ముహూర్తపు పత్రికను ఆలయ స్థానాచార్యులు, అర్చక, వేదపండితులు ఏసీ సత్యనారాయణకు గురువారం అందించారు. ఫిబ్రవరి 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు స్వామివారి కల్యాణం, 8వతేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం, 12వతేదీ బుధవారం 8 గంటలకు స్వామివారి చక్రస్నానం(సముద్రస్నానం), 13వతేదీ సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారికి గ్రామోత్సవాలు(వాహనసేవ) నిర్వహిస్తారు. ఇప్పటికే ఉత్సవాల టెండర్లు ఖరారై సమీక్షా సమావేశాన్ని అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన జనవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు అంతర్వేది ఆలయంలో ఏర్పాటు చేసినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు రంగాచార్యులు, సూపరింటెండెంట్ పి.విజయసారథి, కిరణ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

» పాడె మోసిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి



సాగిపాడులో టీడీపీ నేత పాడె మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సోమరాజు పాడెను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మోశారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజక వర్గం సాగిపాడుకు చెందిన టీడీపీ నేత పంది సోమరాజు(70) గురువారం స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, బీసీ నేతగా పనిచేశారు. ఆయన పార్థీవదేహానికి ఎమ్మెల్యే మద్దిపాటి టీడీపీ జెండా కప్పి నివాళులర్పించి పాడే మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి అండగా ఉంటాన న్నారు. కార్యక్రమంలో కొర్లపాటి రాము, జగదీష్, జ్యేష్ట శ్రీనివాసరావు,రమేష్, వేముల నాగరాజు, బండారు గనిరాజు, శ్రీధర్, మోహనరావు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని

భర్తపై భార్య ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేశారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన కాయల సునీతకు 2021లో అదే గ్రామానికి చెందిన కాయల అనిల్‌కుమార్‌తో ప్రేమవివాహం జరిగింది. వీరికి మూడేళ్ల బాలుడు ఉన్నాడు. సునీత గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తోంది. భర్త కరెంట్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి చర్యలు

» డ్రోన్ టెక్నాలజీతో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

» కాకినాడ జిల్లాలో పోలీస్‌స్టేషన్ల తనిఖీ



పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

పెద్దాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ జిల్లా పెద్దాపురం డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఐజీ మీడియాతో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమవుతుందన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్తులను సులువుగా గుర్తించ వచ్చున్నారు. ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు డ్రోన్ టెక్నాలజీ వినియోగించను న్నట్టు చెప్పారు. గంజాయి నిర్మూలన విషయంలో పలు బృందాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డులను తనిఖీ చేసి వార్షిక పురోగతిపై ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు క్రాంతి కుమార్, ఎ.కృష్ణభగవాన్, పెద్దాపురం ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి: ఐజీ

సర్పవరంజంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరు భయభ్రాంతులకు గురి చేస్తున్న సైబర్ నేరగాళ్లపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఈ తరహా సంఘటనలు జరిగితే తక్షణం 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐజీ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైం నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో గొల్లపాలెం మండలం శలపాక, సామర్లకోట మండలం వేట్లపాలెంలో హత్యలు జరిగాయని తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణకు చిన్న తగాదాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ

'అన్నవరం'లో మార్పులపై ఈవో, చైర్మన్ సమీక్ష

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో లోటుపాట్ల సవరణపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో ప్రకాశ్‌సదన్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా సత్రం గదులు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న భక్తుడికోసం 24గంటలపాటు అతనికి గది కేటాయించాలనే ఉద్దేశ్యంతో ఖాళీగా ఉంచడంతో తర్వాత వచ్చిన భక్తుడికి కేటాయించలేకపోతున్నారు. దీంతో చెక్‌ఇన్, చెక్ అవుట్ సమయం విధిగా రిజర్వేషన్ సమయంలో ఇవ్వాలని సలహాఇచ్చారు. దేవస్థానంలో నగదు రహిత సేవలు లేనందున భక్తులు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ముందుగా ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి డిజిటల్ పేమెంట్ ద్వారా వ్రతం టిక్కెట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈవో, మరికొందరి సిబ్బంది పరిచయ కార్యక్రమం జరిగింది. ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరి వ్రత మండపంలో భక్తుడికి తీవ్ర అస్వస్థత

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన ఒక భక్తుడు గురువారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆందోళన నెలకొంది. విజయవాడకు చెందిన ఏఎస్ ప్రసాద్ కుటుంబసభ్యులతో స్వామిసన్నిధికి విచ్చేసి గురువారం రూ.1500 వ్రతమండపం వద్దకు చేరుకున్నాడు. వ్రతం ప్రారంభం కాకుండానే పక్షవాతం వచ్చి బీపీ పెరిగింది. వెంటనే సిబ్బంది 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి సొంతవాహనంలో దేవస్థానం ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి చికిత్స చేయడంతో ఆయన కుదుటపడ్డాడు.

బాలికతో అసభ్య ప్రవర్తన

పాస్టర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ దేవదాసు కుటుంబరావు ఈనెల 25వతేదీ ఉదయం మండలంలోని ఓ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో వెళ్లాడు. 11ఏళ్ల బాలికను.. సాయంత్రం క్రిస్మస్ పార్టీకి వస్తామనిచెప్తూ బలవంతంగా కౌగిలించుకుని, పలుచోట్ల చెయ్యి వేసి ముద్దు పెట్టుకున్నాడు. బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయడంతో కుటుంబసభ్యు లు కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శునకాలు అడ్డు రావడంతో.. ఆటో బోల్తా

» ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

» కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన



గంటిపెదపూడిలో ఆటో బోల్తా ఘటనలో మృతి చెందిన పల్లయ్య



గాయాలపాలైన వీరవేణి

పి.గన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో ప్రధాన రహదారిపై కుక్కలు అడ్డు రావడంతో ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం వైపీ పాలెం గ్రామానికి చాగంటి సతీష్ తన ప్యాసింజర్ ఆటోతో పి.గన్నవరం గంటిరోడ్డులోని వార్ఫు సెంటర్ నుంచి రావులపాలెం బయలుదేరాడు. ఈ క్రమంలో గంటిపెదపూడి సెంటర్ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా రెండు కుక్కలు చెలగాటం ఆడుతూ ఒక్కసారిగా ఆటోకు అడ్డుగా వచ్చాయి. దీంతో ఆటోను డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో రోడ్డుపై బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురిలో ముమ్మిడివరం మండలం కో మానపల్లి గ్రామానికి చెందిన సవరపు పల్లయ్య(61)కు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సతీష్, ప్రయాణికురాలు వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెల్ల వీరవేణికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్ సాయంతో పి.గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వారిని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొమ్ముబూర ఊదే పల్లయ్యది స్వగ్రామం కోమానపల్లి కాగా ఉడిమూడి సెంటర్‌లో ఆటో ఎక్కాడని తోటిప్రయాణికులు చెప్తున్నారు. కాకినాడలో ఉన్న పల్లయ్య బంధువులకు పోలీసులు సమాచారం అందించి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

» ఇద్దరు గిరిజన యువకులు మృతి

» కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో ఘటన



సంఘటనాస్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ



సుబ్రహ్మణ్యం(ఫైల్)



వెంకటరమణ

శంఖవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో టిఫిన్ చేసేందుకు బయటకు వెళ్లిన గిరిజన యువకులు చీకట్లో వేగంగా ద్విచక్రవాహనంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అన్నవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన బోడోజు వెంకటరమణ(18), బలుం సుబ్రహ్మణ్యం(24) పక్క గ్రామమైన వేలంగిలో టిఫిన్ చేసేందుకు బుధవారం రాత్రి సమయంలో బండిపై వెళ్లారు. అక్కడ పని పూర్తి చేసుకుని తిరిగి బైక్‌పై వేగంగా వస్తున్నారు. ఆమార్గంలో ఓచోట చెట్టును బలంగా ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రివేళలో అటుగా రాకపోకలు తక్కువగాఉండడంవల్ల ఎవరూ ప్రమాదాన్ని వెంటనే గుర్తించలేదు. రాత్రి 11గంటల సమయంలో అటుగా వెళ్తున్న గ్రామస్థులు సంఘటనా స్థలంలో ఇద్దరు యువకులు విగతజీవులుగా ఉండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కానీ అప్పటికే వారు మరణించినట్లు ధ్రువీకరించారు. గిరిజన యువకుల మరణంతో కుటుంబీకులు బోరున విలపించారు. సంఘటనాస్థలాన్ని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు పరిశీలించి మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. ప్రమాదానికిగల కారణాలను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల గంగను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఏజెంట్ మోసం... గల్ఫ్‌లో నరకం

» కూటమి ప్రభుత్వం సహకారంతో మస్కట్‌నుంచి వచ్చిన మహిళ

» బాధితురాలిది కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు

తాళ్లరేవు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన ఆ మహిళ.. ఏజెంట్ చేతిలో మోసపోయి అక్కడ దుర్భర పరిస్థితి ఎదుర్కొంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా పైస్థాయికి వెళ్లడంతో కూటమి ప్రభుత్వ సహకారంతో ఆమెను తిరిగి స్వస్థలానికి తీసుకువచ్చారు.

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి పద్మ 9నెలల క్రితం మస్కట్ దేశానికి వెళ్లింది. ఏజెంట్ సరైన వీసా ఇవ్వకపోవడం.. పాస్‌పోర్టు సరిగ్గా లేకపోవడంతో ఆమెకు పనిచేసే అవకాశం లేకుండా పోయింది. తినడానికి తిండి, ఉండడానికి నీడ దొరకని తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఆమె తన దీనస్థితిని తెలియజేస్తూ తనను రక్షించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను వేడుకుంటూ ఒక వీడియో విడుదల చేసింది. దీన్ని స్థానిక టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, ఆ పార్టీ నేత జక్కల ప్రసాద్ గమనించి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ దృష్టికి తీసుకెళారు.వారి సహకారంతో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి లోకేశ్‌లకు చేరేలా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ ప్రయత్నం ఫలించి ప్రభుత్వ పెద్దలు మస్కట్‌లో ఉన్న భారత రాయబారులను సంప్రదించారు. ఆమెను రక్షించే బాధ్యతను వారికి అప్పగించారు. దీంతో ఆమె ఈనెల 24న మస్కట్ నుంచి తాళ్లరేవులోని తన నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను కలుసుకుంది. తనకు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపింది.



వాసంశెట్టి పద్మ

పది కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం మండలంలోని యర్రవరం జాతీయ రహదారిపై కర్ణాటకకు చెందిన కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో కారును తనిఖీ చేశారు. అందులో పది కిలోల గంజాయిని, నాయజ్ షాషా(41) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దీనివిలువ రూ.60వేలు ఉంటుందన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పాడుబడిన థియేటర్ పైనుంచి పడి..

గుర్తు తెలియని యువకుడి మృతి

» అమలాపురంలో ఘటన

అమలాపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎక్కడి నుంచి వచ్చాడో.. ఎలా వెళ్లాడో తెలియదు గానీ.. దశాబ్దాల కాలం క్రితం అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో మూసివేసిన హనుమాన్ థియేటర్‌లోకి గురువారం గుర్తు తెలియని యువకుడు వెళ్లాడు. శిథిలావస్థలో ఉన్న భవనంపైకి చేరుకుని అక్కడినుంచి పడిపోయాడు. అతడిని 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తు తెలియని యువకుడి సమాచారం కోసం సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర జిల్లాల అధికారులకు సమాచారం అందించినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.



ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన యువకుడు

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

కొత్తపేట మండలంలో ఘటన

కొత్తపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేటమండలంలో చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. కొత్తపేట మండల పరిధి బిళ్లకుర్రు గ్రామశివారు నల్లావారిపేటకు చెందిన గీత కార్మికుడు బండి వెంకటరామారావు(58) గురువారం తనతండ్రి పొలంలో తాటిచెట్టు ఎక్కి గీతకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ కాలుజారి కింద ఉన్న సిమెంట్ స్తంభంపై నేరుగా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట ఏఎస్ఐ జీవీ కృష్ణారావు తెలిపారు.

కాలువలో పడి బాలుడి మృతి

» తూర్పుగోదావరి జిల్లా బల్లిపాడులో విషాదం



చిన్నారి అద్విత్ మృతదేహం

తాళ్లపూడి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు గ్రామంలో కాలువ గట్టును ఆనుకుని ఉండే ఎస్సీ కాలనీలో నివసించే తలపాకుల ఝాన్సీ రాణికి ముగ్గురు సంతానం. చిన్నవాడైన తలపాకుల అద్విత్‌కుమార్(4) అంగన్‌వాడీ సెంటర్‌నుంచి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చాడు. తర్వాత ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మునిగిపోయి మృతి చెందాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త కరోనా సమయంలో మృతి చెందగా ఇప్పుడు చిన్నకుమారుడు చనిపోయాడని ఆమె కన్నీరుమున్నీరవుతోంది. బాలుడి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నూకాంబికా అమ్మవారికి.. వెండి ఆభరణాల బహూకరణ



వెండి ఆభరణాలతో నూకాంబికా అమ్మవారు

ఆలమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారికి భక్తుల సహకారంతో రూ.40లక్షల విలువైన వెండి ఆభరణాలు బహూకరించారు. ముందుగా భక్తులు అమ్మ వారికి 25కిలలో వెండితో తయారు చేయించిన ఆభరణాలకు గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహానికి అలంకరించారు. వెం డి ఆభరణాలను ఆలయ ఈవో వీర్రాజుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించారు.

ఆటోను తప్పించబోయి వంతెనపైనుంచి

పడిపోయిన యువకుడు

» ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

» పండక్కి దుస్తులు కొనుక్కొనేందుకు ద్వారపూడి వెళ్తుండగా ఘటన



ప్రేమ్‌కుమార్ మృతదేహం

మండపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి మోటారుసైకిల్‌పై వెళ్తూ ఓ యువకుడు ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కింద పడి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. కోనసీమ జిల్లా మండపేట రూరల్ పోలీసులు కథనం ప్రకారం.. మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన గానుగుల ప్రేమ్‌కుమార్(17) గురువారం పండక్కి బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి వద్ద బైక్‌తీసుకుని బయలుదేరాడు. ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనపై ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందకు పడిపోగా బైక్ వంతెనపై ఉండిపోయింది. ప్రేమ్‌కుమార్‌ను ద్వారపూడి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మండపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడినుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రేమ్‌కుమార్ తండ్రి చాలాకాలం క్రితం మృతి చెందాడు. తల్లి గంగాభవాని వద్ద కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక వైద్య సేవల్లో పీఎంపీలు కీలకం

పీఎంపీల వ్యవస్థాపక దినోత్సవంలో డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్26(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రాథమిక వైద్య సేవలందిస్తున్న పీఎంపీల పాత్ర సమాజంలో కీలకమని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యంలో రెడ్డీస్ కన్వెన్షన్ హాల్‌లో పీఎంపీల 62వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నిర్వహించారు. అధునాతన వైద్య విధానాలు, ప్రోస్టేట్ సమస్యలపై చర్చించారు. రాజేంద్రనగర్‌లోని జిల్లా సంఘ కార్యాలయం వద్ద వ్యవస్థాపకుడు స్వర్గీయ ఆర్కే భరద్వాజ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలికి చెందిన డాక్టర్ ఎన్ఎల్‌రావు, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జాతీయ కార్యదర్శి వీబీటీ.రాజు,తోరాటి ప్రభాకరరావు,గంగుమళ్ళ రాంబాబు తదితర పీఎంపీలు పాల్గొన్నారు.

మతోన్మాదంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద నినాదంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయం, కూరగాయల మార్కెట్, అపరాల మార్కెట్, కొత్తపేట, క్వారీ మార్కెట్ సెంటర్ ప్రాంతాల్లో గురువారం సీపీఐ శత వార్షికోత్సవాల జెండా ఆవిష్కరణలు జరిగాయి. మధు మాట్లాడుతూ మతోన్మాద శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదల పక్షాన నిలిచి పోరాడేది సీపీఐ పార్టీయే అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, నగర కార్యవర్గసభ్యులు నల్ల రామారావు, సేపేని రమణమ్మ, సిడగం నౌరోజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై నేడు వైసీపీ పోరుబాట

జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం అర్బన్/కల్చరల్/రాజానగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నదని, దీన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే రాజా నివాసంలో గురువారం పార్టీ శ్రేణుల సమక్షంలో పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి పిలుపుమేరకు విద్యుత్ ఛార్జీల పెంపుపై పోరుబాట చేపడుతున్నామన్నారు. శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని నిరసనలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, నందెపు శ్రీనివాస్, అడపా అనిల్ పాల్గొన్నారు.

రంగాకు ఘన నివాళి



రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ/ కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అండగా నిలబడి పోరాటం చేసిన వంగవీటి మోహన రంగ ఆశయ సాధనకు కృషి చేద్దామని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాధా రంగా మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు వడ్డి మురళీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ కళాశాల వద్ద వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని నిర్వహించారు. దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో కాపునాడు నగర అధ్యక్షుడు విన్నా వాసు ఆధ్వర్యంలో పేదలు,కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, దేశిరెడ్డి బలరామనాయుడు, కోటిపల్లి వెంకట రామారావు, కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్, ముమ్మిడి వీరబాబు,దేశినీడి రాంబాబు,కాలచక్రరావు,బాలకృష్ణ నాయుడు తదితరులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీనివాసుడికి పట్టు వస్త్రాల అందజేత



బలభద్రపురంలో శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

బిక్కవోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామి, అమ్మవార్లకు పూజలు జరిపారు. ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో కూటమి నేతలు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, మల్లిడి అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొల్లమండపంలో ఆంజనేయ స్వామికి పూజలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా గ్రామానికి చెందిన గొర్రిపూడి వెంకన్న, ముత్యాలు, బుజ్జి సోదరులు రూ.11 లక్షలతో నిర్మించి గురువారం ప్రారంభించారు. ఈ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామానికి చెందిన కురందాసు సత్తిబాబు, వెంకటేష్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ఆంజనేయస్వామిని దర్శించి పూజలు చేశారు. గొల్లమండపం, ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసిన దాతలను ఆయన అభినందించారు.

గరుడ వాహనంపై వేంకటేశుడి ఊరేగింపు

బిక్కవోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఉదయం సుప్రభాత సేవ జరిపి ఆపై విశేషోత్సవం, జలకుంకుమోత్సవం, వెంకటేశ్వర వ్రతం కార్యక్రమాలు జరిపారు. అనంతరం రాత్రి స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంలో వుంచి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. మాడవీదులో గరుడ వాహనం లాగడానికి భక్తులు పోటీపడ్డారు.



బలభద్రపురంలో గరుడ వాహనంలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరుడు

ఇళ్లపల్లి టీచర్ రమాదేవికి స్టేట్ బెస్ట్ సర్వీస్ అవార్డు



విజయవాడలో మంత్రి నాదెండ్ల నుంచి బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న రమాదేవి

బిక్కవోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న జి.రమాదేవికి స్టేట్ బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. వినియోగదారుల హక్కులను వారికి తెలియజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చినందుకు ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అవార్డు అందుకున్నారు. దీంతో గురువారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి అవార్డు పొందిన ఆమెను హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ తమలంపూడి ఈశ్వరరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాలలో దివీస్ లాబరేటరీ హెచ్ఆర్ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో దివీస్ హెచ్ఆర్ ప్రతినిధులు అప్పసాని రాజేష్, పోతు రామకృష్ణ.. బీఏ స్సీ, ఎమ్మెస్సీ, ఎం-ఫార్మసీ, బి-ఫార్మసి, బీటెక్ విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు. దివీస్ ప్రతినిధి రాజేష్ కంపెనీ విధి విధానాలను వివరించారు. తమ కళాశాలలో విద్యతో పాటు ఉద్యోగ కల్పన అందించాలని ఉద్దేశ్యంతో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కె.సూరిబాబు, ఉభయ గోదావరి, అల్లూరి జిల్లాలు నుంచి 54 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు.

వర్మీకంపోస్టు తయారు చేయాలి

ఉండ్రాజవరం, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీలు వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలని శానిటేషన్ మండల కోఆర్డినేటర్ కె.ప్రకాశ్ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో డంపింగ్‌యార్డు షెడ్లను ఆయన పరిశీలించారు. చెత్త ద్వారా సంపదను తయారు చేసుకోవచ్చని, పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుల వద్ద వేరు చేయాలని సూచించారు.

రూ.6.92 కోట్లు పెండింగ్

- రాజానగరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ బకాయిలు
- సర్వే పూర్తి చేసిన గృహ నిర్మాణశాఖ
- జాబితాను ప్రభుత్వానికి నివేదించిన హౌసింగ్ అధికారులు



గ్రామాల్లో సర్వే చేస్తున్న గృహనిర్మాణ సంస్థ అధికారులు(ఫైల్)

రాజానగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులకు సంబంధించి మోక్షం లభించనుంది. అప్పులు చేసి ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు అసలు బిల్లులు వస్తాయో లేదో తెలియని అయోమయంతో ఎదురు చూస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. 2014- 2019 మధ్య ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలకు వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా బిల్లులు చెల్లించలేదు. వివిధ దశల్లో పూర్తయిన ఇళ్లకు బిల్లులు రూపొందించి గృహ నిర్మాణశాఖ ఆన్‌లైన్‌లో పొందుపరిచినప్పటికీ నిధులు మంజూరు చేయలేదు. ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు వంతున ఎస్సీ ఎస్టీలకు రూ.2.5 లక్షలు యూనిట్ విలువగా అప్పట్లో నిర్ణయించారు. నాలుగు దశల్లో ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు ఇచ్చేవారు పునాది పూర్తయిన వెంటనే గతంలో బిల్లు వచ్చేది. దీంతో ఇంటి నిర్మాణంలో తదుపరి దశకు వెళ్లేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చే నాటికి పునాదులు పూర్తయిన బిల్లు అప్‌లోడ్ చేసినా సొమ్ములివ్వలేదు. నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో 962 ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి రూ.6.92కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కోరుకొండ మండలంలో 276 మంది లబ్ధిదారులకు రూ.1.82కోట్లు, రాజానగరం మండలంలో 309 మంది లబ్ధిదారులకు రూ.2.32 కోట్లు, సీతానగరం మండలంలో 377 మంది లబ్ధిదారులకు రూ.2.75 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నట్లుగా అధికారులు నివేదించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 962 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.6.92 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు గృహ నిర్మాణశాఖాధికారులు చెప్పారు.

క్షేత్రస్థాయి సర్వే పూర్తి..

పెండింగ్‌లో ఉన్న ఎన్టీఆర్ ఇళ్ల ప్రస్తుత పరిస్థితిపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లను గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సహాయ ఇంజనీర్లు, సిబ్బంది గ్రామాల్లో సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. తాజా పరిస్థితిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పూర్తిస్థాయి నివేదిక ప్రభుత్వానికి నివేదించినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే గుర్తించిన ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తామని రాజానగరం హౌసింగ్ ఏఈ ఏవీ రామారావు తెలిపారు.

సినీ హీరోలను చూసి పగటి కలలు కనొద్దు

వ్యక్తిత్వ వికాస స్ఫూర్తి సదస్సులో సత్యగోపినాథ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సినిమా హీరోలను చూసి పగటి కలలు కంటే భవిష్యత్ నాశనమవుతుందని ఆధ్యాత్మిక గురువు సత్యగోపినాథ్ దాస్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ భాష్యం జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస స్ఫూర్తి సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులపై భక్తి భావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్టు నిడదవోలు రైల్వే పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం డీమార్టు పరిసర ప్రాంతానికి చెందిన బైరి నవీన్ లక్ష్మణరావు(25)కు తల్లిదండ్రులు లేరు. ఇద్దరు అన్నయ్యలతో కలిసి నివసిస్తున్నాడు. ఇటీవల ఒక అమ్మాయిని ప్రేమించాడు. అన్నయ్యలు ఆ అమ్మాయిని మర్చిపోవాలని సూచించడంతో మనస్థాపం చెంది కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని వేములూరు అండర్ టన్నెల్ వద్ద గురువారం గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు

- టార్గెట్‌లు లేవంటున్న ఆర్‌బీకేలు
- ఆందోళనలో వరి రైతన్నలు



కొనుగోలు లేక నిలిచిపోయిన ధాన్యం రాశులు

కోరుకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలంలో వారం రోజులుగా కోసిన వరి ధాన్యాన్ని అమ్ముకుందామంటే కొనేవాళ్లు లేక రైతులు లబోదిబోమంటున్నారు. వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్ల కోసం రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఆర్‌బీకేలలో తమకు ఇచ్చిన టార్గెట్‌లు అంటూ అయిపోయాయంటూ వెనక్కి తిప్పి పంపుతున్నారు. అటు మిల్లర్లు చుట్టూ, ఇటు రైతు భరోసా కేంద్రాల చుట్టూ రైతులు చక్కర్లు కొడుతున్నారు. ఒక ప్రక్క వాతావరణం అనుకూలించక, ఇప్పటికే కోసిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకుందామంటే దారి లేక నానా అవస్థలు పడుతున్నారు. సాధారణంగా కోరుకొండ మండలంలోని కోరుకొండ, జంబుపట్నం, పశ్చిమ గోనగూడెం, బూరుగుపూడి,దోసకాయపల్లి, నర్సాపురం, కణుపూరు, గాదరాడ గ్రామాల్లో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇంకా 50శాతం వరి కుప్పల మీద, పనల మీద ఉంది. కాగా నర్సాపురం రైతు భరోసా కేంద్రం ద్వారా గత సంవత్సరం 3వేల మెట్రిక్ టన్నులు పైగా ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ఈ సంవత్సరం కేవలం 800 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసి టార్గెట్ అయిపోయిందంటూ తలుపులు మూసివేశారు. దాదాపు అన్ని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రాల్లో టార్గెట్ ఉంటేనే రైతులు తమ ధాన్యాన్ని మిల్లుకు తరలించి అమ్ముకోగలరు. ప్రతి రైసు మిల్లు వద్ద లారీల కొద్ది ధాన్యం నిల్వలు గుట్టలుగా ఉన్నాయి. దీంతో ముందుగా ధాన్యం కోసి రైస్ మిల్లుకు తరలించిన రైతులకు ఇప్పటి వరకు టార్గెట్ లేదంటూ టోకెన్ ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో తెలియదు. ఈ నేపథ్యంలో వరి కుప్పల మీద, పనల మీద చేనుగా ఉన్న వరి ధాన్యాన్ని ఏం చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల ముందుగా కోతలు పూర్తికావడంతో జిల్లా టార్గెట్ అయిపోయిందంటూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది. తక్షణం కోరుకొండ మండలంలోని మెట్ట గ్రామాలకు టార్గెట్‌లు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని రైతులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నా వారం రోజులుగా టార్గెట్‌లు ఇవ్వలేదని రైతులు పేర్కొన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.



కోరుకొండలో ధాన్యం రాశిపై టార్పలిన్ కప్పి ఉంచిన రైతు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రంగంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డు విస్తరణ, సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు 33/11 కెవి వడిశలేరు సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11కేవీ వడిశలేరు టౌన్ ఫీడర్, 11కేవీ వడిశలేరు రూరల్ ఫీడర్, 11కేవీ ఎస్టీ రాజాపురం ఫీడర్‌నకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. వడిశలేరు, ముకుందవరం, ఎస్టీరాజాపురం, గోవిందరాజాపురం, వెంకన్నపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఆయన తెలిపారు. జి.దొంతమూరు, రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ శ్రీధర్‌వర్మ కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని బిక్కవోలు తహశీల్దార్ సత్యకృష్ణ అన్నారు. మెళ్లూరులో గురువారం సర్పంచ్ సాయిరామ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 11 మ్యూటేషన్లకు సంబంధించి దరఖాస్తులు అందించారు. కార్యక్రమం లో వీఆర్ఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల పోరాటానికి ఏకం కావాలి

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం పోరాడే శక్తులన్నీ ఏకం కావలిసిన సమయం ఆసన్నమయ్యిందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న జరిగే సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని ముద్రించిన పోస్టర్‌ను గురువారం కొవ్వూరులో ఆవిష్కరించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పనిచేసే విప్లవ పార్టీలు మరిన్ని ఐక్యం కావలిసిన అవసరం ఉందన్నారు. దేశంలో కార్పొరేట్ నాగ సర్పం కుబుసం విప్పి ప్రజల జీవనంపై బుసలు కొడుతూ కాటు వేస్తోందన్నారు. దీంతో బడుగు, బలహీనవర్గాల ప్రజల రాజ్యం కోసం పోరాటం చేసే శక్తులు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక, నాగమణి, బాషా తదితరులు పాల్గొన్నారు.



లంక భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఆర్డీవో కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

లంక భూములు పరిశీలించిన జేసీ

సీతానగరం, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి) తాళ్ళపూడి మండలం ప్రక్కిలంక, సీతానగరం మండలానికి చెందిన ములకల్లంక గ్రామాల లంక భూములను గురువారం రాజమండ్రి ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలతో కలసి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు పరిశీలించారు. సీతానగరం మండలం ములకల్లంక, తాళ్ళపూడి మండలం ప్రక్కిలంక రెవెన్యూలో గల 22 మంది రైతులు తమ భూమిలో ఇసుక ను తొలగించే విధంగా అనుమతులు ఇవ్వాలని పెట్టుకున్న దరఖాస్తుల మేరకు సుమారు 70 ఎకరాల లంక భూమిలో హద్దులు సరిగా ఉన్నాయా లేదా అని అధికారులను తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, తాళ్ళపూడి డీటీ మోహన్ భారతి, ఏడిఏ మల్లిఖార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ప్రకాష్, ఏఎల్‌బి ఏఈ శివప్రసాద్, మైన్స్ అసిస్టెంట్ జియాలజిస్ట్ విఘ్నేష్, వీఆర్వో లీల ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

రంగాకు పలువురు నివాళి

కడియం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వంగవీటి రంగా వర్ధంతిని మండలంలోని కడియం, వీరవరం, వేమగిరి, పొట్టిలంక, జేగురుపాడు గ్రామాల్లో జరిపారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కడియం మండలం వీరవరంలో రంగా విగ్రహం చుట్టూ ఆయన పేరిట సుందరంగా పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నపిల్లలు సరదాగ గడిపేందుకు జారుడు బల్ల, ఊయల బల్లలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో రంగా అభిమానులు, ప్రజాప్రతినిదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వీరవరం రంగా పార్కులో జారుడు బల్లలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు



బైబిల్ మిషన్‌లో క్రిస్మస్ వేడుకలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కడియం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దామిరెడ్డిపల్లి బైబిల్‌మిషన్ క్రిస్మస్ వేడుకలు చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ డి.రతన్‌రాజు నిర్వహణలో నిర్వహించారు. సిస్టర్ సుదర్శిని క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. కేకు కట్ చేసి సంబరాలు చేశారు. సీహెచ్ పాల్ దొరబాబు ప్రారంభ ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ అధ్యక్షత వహించారు. రూరల్ ఏఏసీసీ అధ్యక్షులు కె.జయశీల్, అపోస్తలిక్ బైబిల్ మిషన్ వ్యవస్థాపకులు రెవరెండ్ బండి అబ్రహం గ్రీటింగ్స్ తెలిపారు. పి రత్నకుమార్ ముగింపు ప్రార్థనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, కిరణ్, సునీల్, అనిరుధ్, బొర్రా బుజ్జి, రవికుమార్, సరోజిని, సంపర రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీ

కొవ్వూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాల దొంగతనంపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. స్థానిక చిట్టూరి వారి వీధికి చెందిన మోదుగ శ్రీనివాస్ ఈ నెల 20వ తేదీ రాత్రి తన సుజుకి యాక్సిస్ మోటారుసైకిల్‌ను ఇంటిముందు పార్క్ చేశాడు. ఉదయం చూసేసరికి కనిపించకపోవడంతో వెతికాడు. దొరకకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై హెచ్‌సీ ఆర్.సాంబమూర్తి కేసునమోదు చేశారు. అలాగే విజయవాడ నరసింహ ఎన్‌క్లేవ్‌కు చెందిన పఠాన్ శభాష్‌ఖాన్ ఈ నెల 15న కొవ్వూరు లక్ష్మీ కేఫ్ వద్ద రూ.2 లక్షల విలువైన డ్యూక్ మోటారుసైకిల్ పార్క్‌చేసి టిఫిన్ చేసి వచ్చేసరికి దుండగులు దొంగిలించుకుపోయారు. దీనిపై పట్టణ హెచ్‌సీ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

పైడిమెట్టలో క్రిస్మస్ వేడుకలు



విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ప్రమోద్‌కుమార్

తాళ్లపూడి, డిసెంబరు 27: మండలంలో పైడిమెట్ట గ్రామంలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ప్రత్తిపాటి నిస్సీ సాగర్‌కు తాళ్లపూడి విజేత పాఠశాల ప్రిన్సిపాల్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. సంఘస్తులు పాల్గొన్నారు.





ఆడుకుంటూ.. కాలువలోకి!



అమ్మా ఆడుకుంటానంటే అలాగే అంది.. అదే చివరి మాట అవుతుందని ఆ అమ్మకు తెలియదు పాపం.. కుమారుడు బయట ఆడుకుంటున్నాడు కదా అనుకుంటుంది.. కాసేపటి తరువాత చూస్తే బాలుడు కనిపించలేదు.. ఆడుకుంటూ ఆ నాలుగేళ్ల బాలుడు కాలువలోకి వెళ్లిపోయాడు.. లోతు ఎక్కువగా ఉండడంతో ఊపిరాడక చనిపోయాడు.. విగతజీవిగా కనిపించిన కుమారుడిని చూసి తల్లి తట్టుకోలేక పోయింది.. హత్తుకుని లేనాన్నా అంటూ బోరున విలపించింది.. - 8లో

రిజిస్ట్రేషన్లకు క్యూ

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూముల విలువ పెరుగుతుందనే సమాచారంతో రిజిస్ట్రేషన్లకు కక్షిదారులు బారులుతీరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ రిజిస్ట్రేషన్ కార్యాలయం చూసినా కిటకిటలాడుతున్నాయి. 2025 జనవరి 1వ తేదీ నుంచి భూముల విలువ పెరుగుతుండడంతో ప్రతి రోజూ క్యూకడు తున్నారు. గురువారం ఏకాదశి మంచి రోజు కావడంతో జిల్లా లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కక్షిదారుల పోటెత్తారు. సాధారణంగా కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సరాసరి 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. భూములు, స్థలాల ధరలు పెరుతాయని సమాచారం రావడం గురువారం భారీగా కక్షిదారులు తరలివచ్చారు. సుమారు 100 వరకు రిజిస్ట్రేషన్లకు దరఖాస్తుదారులు వచ్చారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి లాంచీలరేవు వరకు రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారి కార్లతో రహదారి నిండిపోయింది. రిజిస్ట్రేషన్లకు వచ్చినవారు ఉదయం నుంచి రాత్రి ప్రొద్దుపోయే వరకు రోడ్డుపైనే నిల్చుండిపోయారు. దీనికి తోడు సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో మధ్యాహ్నం 1 గంట సమయానికి 10 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. రిజిస్ట్రేషన్లు పక్రియ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు కావొస్తుందని భావిస్తున్నారు.

పదోన్నతిపై వెళ్లిన వైద్యాధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు గురువారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వీరికి ప్రభుత్వం సీఎస్ఆర్ఎంవోలుగా ఇటీవల పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. డాక్టర్ రాజకుమారి కాకినాడ జీజీహెచ్‌కు సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతిపై నియమతులు కాగా, డాక్టర్ శ్రీహరిబాబు పలాస కిడ్నీ స్పెషాలిటీ అండ్ రీసెర్చి సెంటర్‌కు సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతి పొందారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, సహ అధికారులు, ఉద్యోగులు వారిని అభినందించారు.

గత నాలుగేళ్లుగా బిల్లులందక ఇక్కట్లు

కాంట్రాక్టర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు

చాగల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఇంకా బిల్లులు రాలేదని ప్రభుత్వ కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేడా వెంకట దుర్గాప్రసాద్ అన్నారు. చాగల్లులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగేళ్లగా బిల్లులు చెల్లింపులు జరగక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్ల పట్ల దయతో వ్యవహరించి బిల్లులు చెల్లించాలని కోరారు.కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు బకాయిలు ఉండడం వల్ల అభివృద్ధి పనులు ముం దుకు సాగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీఎస్పీ ప్రాంతీయ కార్యాలయం మార్పు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రత్యేక రక్షణ దళం ప్రాంతీయ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం నారాయణపురంలో ఏర్పాటు చేసినట్టు ఏపీఎస్పీ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహరావు తెలిపారు. నూతన కార్యాలయం వద్ద గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సర్వమత ప్రార్థనలు చేసి ప్రారంభించారు. నారాయణపురం నాగమ్మతల్లి గుడి వెనుక ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కమాండెంట్ పీవీఎస్ ఏడీ ప్రసాదరావు, డి.గంగరాజు పాల్గొన్నారు.

కొత్తతుంగపాడులో బాల్యవివాహం కలకలం

దివాన్‌చెరువు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామంలో బాల్యవివాహం జరిగిందన్న సమాచారం మేరకు అధికారులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అధికార్లు వెనుదిరిగారు. కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన యువకుడు(27) అదే గ్రామానికి చెందిన బాలిక (16) తో బుధవారం రాత్రి వివాహం జరిగిందని సమాచారం అందుకున్న అధికారులు గురువారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. అయితే తమకు సంబంధం లేదంటూ ఇరువర్గాల పెద్దలు తప్పించుకునే ప్రయత్నం చేశారు.తమకు అందిన సమాచారం వాస్తవం అని తేలడంతో ఆ గ్రామానికి వెళ్లిన అధికార్లు బృందం నూతన వధూవరుల కోసం ప్రయత్నించారు. బాలిక 9వ తరగతి వరకూ చదివి మానివేసినట్టు వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నట్టు తెలిసిందన్నారు. వివాహమైన తరువాత వారు తిరుపతి వెళ్లారని అధికారులు చెప్పారు. వారు తిరిగి వచ్చిన వెంటనే తమ వద్దకు తీసుకురావాలని వధూవరుల బంధువులకు చెప్పి అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.ఈ విషయంలో బాలిక తల్లిదండ్రులు తమకు సహకరించలేదంటూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాసరయ్య మాట్లాడుతూ గ్రామంలో బాల్యవివాహాల నిరోధక కమిటీ ఉన్నప్పటికీ వారు తగిన రీతిలో స్పందించడం లేదని వాపోయారు.

ప్రియురాలిని మర్చిపోమన్నారని..
యువకుడి ఆత్మహత్య
క్రిస్మస్ పండగ పూట
పాస్టర్‌పై పోక్సో కేసు 8



అక్రమార్కులను మట్టి కరిపిస్తారా..?: పోలవరం కాలువ గట్టుపై కరిగిపోయిన మట్టి మేటలు

మహా మేతలు!

పోలవరం మట్టినీ మింగేసిన వైసీపీ నేతలు

- రూ.350 కోట్లు హాంఫట్
- అక్రమార్కులపై కానరాని చర్యలు
- ప్రభుత్వం మారినా అదే తీరు
- విజిలెన్స్ విచారణకూ దూరం
- కాలవ గట్టుపై మట్టి మాయం
- పేదల స్థలాల చదును ముసుగు
- భారీగా అక్రమ మట్టి తవ్వకాలు
- రియల్‌ఎస్టేట్‌కు విక్రయాలు
- లేఅవుట్లకు తరలింపు
- కొమరగిరిలో రూ.6 కోట్లు
- కోట్లకు పడగలెత్తిన నేతలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల కోట్ల విలువైన పోలవరం మట్టిని మింగేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అప్పట్లో పేదల ఇళ్ల స్థలాలకు పోలవరం మట్టిని తవ్వి తరలించడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు తాత్కాలిక అనుమతులివ్వగా.. ఆ ముసుగులో మొత్తం మట్టంతా మింగేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు తెర వెనుక ఉండి సాగించిన దందాతో కోట్లకు కోట్లు కూడబెట్టారు. అదే సమయంలో గనుల శాఖకు రాయల్టీ సైతం చెల్లించకుండా పంగనామాలు పెట్టేశారు. ఒకరకంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడింది. ప్రభుత్వం మారడంతో అక్రమార్కులపై చర్యలు తప్పవని అంతా భావించారు. కూటమి సర్కారు గద్దెనెక్కినా విజిలెన్స్ విచారణకు అతీగతీ లేకుండాపోతోంది. ఎందుకో తెలియదుగానీ అధికారుల నుంచి ప్రభుత్వానికి నివేదికలు పంపకుండా తాత్సారం జరుగుతోంది. ఇప్పటికే కాకినాడ కేంద్రంగా గడచిన ఐదేళ్లలో చోటు చేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలు, టీడీఆర్ బాండ్లలో కోట్లు కొట్టేసిన దొంగలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ అదే స్థాయిలో రూ.350 కోట్లకుపైగా మట్టిలో మెక్కేసిన దొంగలపై అసలు విచారణ దిశగా అడుగులు పడకపోవడంతో అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

మట్టంతా మింగేశారంతే..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వంద కిలోమీటర్లమేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా వెళుతోంది. గతంలో ఈ కాలువను 18మీటర్ల లోతుకు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటిని కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో పోగేశారు. అయితే వైసీపీ రాక ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దీనివైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. వేసిన మట్టిదిబ్బలు వేసినట్టే ఉన్నాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీ నేతలు మట్టిపై గద్దల్లా వాలిపోయారు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయించేశారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని గడచిన ఐదేళ్లలో అనుమతులతో సంబంధం లేకుండా గుట్టు చప్పుడుకాకుండా పదుల సంఖ్యలో పొక్లెయినర్లు పెట్టి వేలాది టిప్పర్లతో తరలించేశారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయ రహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మేటలు, తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీన్నంతటిని అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని తవ్వాలంటే జలవనరుల శాఖ, గనుల శాఖకు డబ్బులు చెల్లించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధన లేవీ పనిచేయకపోవడంతో ఎవరికివారు మట్టితో కోట్లు కొల్లగొట్టారు. గనులు, జలవనరులశాఖాధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 90 శాతానికిపైగా మాయమైపోయింది. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమై పోయింది. ముఖ్యంగా ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల పరిధిలో కొండలు, గుట్టల మీదుగా పోలవరం కాలువ తవ్వడం వల్ల ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ మట్టి పోగైంది. గడచిన ఐదేళ్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల హోదాలో పర్వత ప్రసాద్, దాడిశెట్టి రాజాకు చెందిన అనుచరులు పోలవరం మట్టితో రెండు జేబులూ నింపేసుకున్నారు.

మట్టి మింగేశారిలా..

పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో 350 ఎకరాల్లో సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్ల స్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతి సమీపంలో ఉండడంతో చిన్నపాటి వర్షాలకు ముంపునకు గురవుతాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదునుచేశారు. ఇందుకు గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని వేలాది టిప్పర్లలో కొన్ని వారాలపాటు తరలించారు. ఈ లేఅవుట్ చదునుకు ఎంత పరిమాణంలో పోలవరం మట్టి తరలించాలనే దానిపై అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ చదును ముసుగులో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో పోలవరం మట్టి తరలించారు. వాస్తవానికి పోలవరం మట్టిని ఇళ్ల స్థలాల అవసరాలకు ప్రభుత్వం తాత్కాలిక అనుమతులు ఇచ్చినప్పుడు రోజుకు ఎన్ని టిప్పర్లు మట్టి తరలిస్తున్నారు? అసలు ఎంత తవ్వుతున్నారు? వంటి వివరాలు అధికారులు లాగ్‌బుక్‌లో నమోదుచేయాలి. కానీ అప్పట్లో ఇదేదీ జరగలేదు. తవ్వుతున్న మట్టిలో ప్రభుత్వ అవసరాలకు ఎంత వెళ్తుంది? రియల్ ఎస్టేట్ అవసరాలకు ఎంత పంపుతున్నారనేది పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో కాకినాడ కీలక నేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

రూ.350 కోట్లు వస్తాయని లెక్క..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖజానాకు నిధులు సమకూర్చడం కోసం ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో 12కోట్ల క్యూబిక్‌మీటర్ల పోలవరం మట్టిని విక్రయించి రూ.900 కోట్ల ఆదాయం రాబట్టాలని 2019లో భావించింది. ఈ మేరకు మంత్రుల కమిటీ ఏర్పాటుచేసి అంచనా వేయించింది. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరిలోనే మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని అధికారులు లెక్కగట్టారు. మట్టిని విక్రయించడానికి వీలుగా రాష్ట్ర గనులశాఖ పరిధిలోకి పోలవరం కాలువలను తీసుకురావాలని అప్పట్లో మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఆ తర్వాత వేలం విషయం ప్రభుత్వం మర్చిపోయింది. దీంతో ఐదేళ్లలో వైసీపీ నేతల దోపిడీతో మట్టి ద్వారా ఖజానాకు రావలసిన కోట్లు నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో పోలవరం మట్టి మేతపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. పైగా అసెంబ్లీలోను మట్టి మాఫియా అంశంపై చర్చ జరిగింది. కానీ ఇప్పటివరకు విజిలెన్స్ అధికారులు విచారణకు రంగంలోకి దిగలేదు. పోలవరం మట్టి మాయం ద్వారా గనులశాఖ రాయల్టీ ఆదాయానికి గండిపడిందనే కోణంలో దర్యాప్తు జరుగుతుందని అధికారులు చెప్పినా, ఇంతవరకు అసలు ఉలుకుపలుకూ లేదు. ఇప్పటికే కాకినాడలో రేషన్ మాఫియా అంతు తేల్చడానికి ప్రభుత్వం సిట్‌ను నియమించి దర్యాప్తు చేయిస్తోంది. కాకినాడలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోలవరం మట్టి అక్రమాలపైనా విజిలెన్స్‌తో విచారణ చేయించాల్సిన అవసరం ఉంది.



గత జూన్‌లో పేపరుమిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

పేపరు మిల్లు కార్మికుల

ఆ.వేతన!

వేతనం పెంచాలని కార్మికుల డిమాండ్

- రూ.10,500 పెంచాలని డిమాండ్
- రూ.3,500లకే కంపెనీ ఆమోదం
- ఒప్పుకోని కార్మికులు
- ఎటూ తేల్చని యాజమాన్యం
- కూటమి నాయకుల చర్చలు
- ఇప్పటికే రెండు సార్లు సమావేశం
- అయినా మారని తీరు
- కార్మికుల సమ్మె యోచన
- సీఎం చంద్రబాబు దృష్టికి సమస్య

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కార్మికుల వేతన ఒప్పందం చిలికి చిలికి గాలి వాన మాదిరిగా మారింది. ప్రస్తుతం పేపరుమిల్లు కోట్లాది రూపాయల లాభాల్లో ఉన్నా యాజమాన్యం మాత్రం కార్మికుల వేతన ఒప్పందం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. 2019లో జరిగిన వేతన ఒప్పందంలో మిల్లు యాజమాన్యం పర్మినెంట్ కార్మికుడికి రూ.9 వేలు పెంచే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ అగ్రిమెంట్ 2020 జూన్ 1తో ముగిసింది. అప్పటి నుంచి 31వ తేదీ డిసెంబరు 2023 వరకు వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా దానిని యాజమాన్యం నిర్లక్ష్యం చేసింది. వేతన ఒప్పందం గడువు దాటి ఏడాది పూర్తయినా కార్మికులు డిమాండ్‌ను నిర్లక్ష్యం చేస్తూ యాజమాన్యం మొండివైఖరి అవలంభిస్తోంది.

2,728 మంది కార్మికులు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లులో 728 మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. 1972 నుంచి 2019 వరకు 14 వేతన ఒప్పందాలు జరిగాయి. కార్మికుల కష్టంతో ఫ్యాక్టరీ 1300 కోట్ల రూపాయల లాభాల్లో ఉన్నా యాజమాన్యం కార్మికుల డిమాండ్‌ను పట్టించుకోవడంలేదు.కార్మికుల డిమాండ్ ఆమోదిస్తే వేతనాల ద్వారా రూ.36 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. దీంతో మిల్లు లాభాల బాటలో ఉంటే కార్మికులు కష్టాల బాటలో ఉన్నారు.

యజమానుల దోబూచులాట

ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు నూతన వేతన ఒప్పందంపై 14 కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నాయి. మిల్లు యాజమాన్య వైఖరికి నిరసనగా సమ్మెకు దిగాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యాజమాన్య ప్రతినిధుల మధ్య చర్చల నేపథ్యంలో సమ్మెను విరమించి విధులకు హాజరవుతున్నారు.ఇదిలా ఉండగా మంత్రి దుర్గేష్ నాలుగు నెలల కిందట కార్మికులు, అధికారులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మికశాఖ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు.14 కార్మిక సంఘాల ప్రతినిధులు మిల్లు కార్మికులకు రూ.10,500 వరకూ పెంచాలని డిమాండ్ చేశాయి.ఈ సమావేశానికి హాజరైన మిల్లు ఈడీ ముఖేష్ జైన్ కార్మికులకు రూ.3250 పెంచుతామని చెప్పారు. అప్పుడు దీనిపై చర్చ జరగ్గా తదుపరి సమావేశానికి ఒక కొలిక్కి రావాలని నిర్ణయించారు.ఈ నెల 24న కలెక్టరేట్‌లో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి,బత్తుల బలరామకృష్ణ ,అసిస్టెంట్ లేబర్ కమిషనర్ల సమక్షంలో మిల్లు కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో రెండో సారి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఈడీ ముఖేష్ జైన్ పాల్గొనలేదు.ఆయన తరపున హాజరైన ప్రతినిధులు రూ.3500 పెంచుతామని ప్రకటించారు. దీనిని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. మిల్లు యాజమాన్యం 2019లో చేసి అగ్రిమెంట్‌ను నూతనంగా చేసే వేతన ఒప్పందానికి కలుపుకుని కార్మికుడికి రూ.12,500 వరకు పెంచినట్టుగా ఉంటుందనే లెక్కలను కట్టారు.కార్మిక సంఘాలు, మంత్రి, ప్రజాప్రతినిధులు వాటిని వ్యతిరేకించాయి. కార్మిక సంఘాలు రూ.10,500 పెంచాలని డిమాండ్ చేశాయి.మిల్లు యాజమాన్యం మాత్రం వేతన ఒప్పందంలో కార్మికులు..పాలకులతో దోబూచులాడుతుంది.ఈ సమస్య ఇప్పుడు సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. అతి త్వరలో సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

యాజమాన్యం మొండివైఖరి వీడాలి

కార్మికుల కష్టంతో లాభాల బాటలో ఉన్న పేపరుమిల్లు యాజమాన్యం అదే కార్మికులు వేతన ఒప్పందంలో మొడి వైఖరితో ఉండడం చాలా దుర్మార్గం.కార్మికులు ఏడాదిగా వేతన ఒప్పందం కోసం వేచి చూస్తున్నారు. సమ్మెలోకి వెళ్లినా పట్టించుకోకపోడం దారుణం. కార్మికుల డిమాండ్ మేరకు వేతన ఒప్పందం లేకపోతే ఉద్యమం తప్పదు.
- అరుణ్, సీఐటీయూ, రాజమహేంద్రవరం

రూ.10,200లకు ఓకే..

ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు యాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందంపై కాలయాపన చేయడాన్ని ఖండిస్తున్నాం.గత సమావేశంలో ఈడీ ముఖేష్ జైన్ రూ.3250 పెంచుతామన్నారు. ఈ నెల 24న సమావేశంలో కేవలం రూ.250 మాత్రమే పెంచి రూ.3500 ఇస్తామనడం సరికాదు. కార్మికులు దానికి ఒప్పుకోరు. కార్మికులు రూ.10,200 ఇస్తే అంగీకరిస్తారు.
- ఎ.జగన్నాథరావు, మిల్లు కార్మిక నేత

డిజిటల్ అరెస్టుల్లేవ్

సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

- జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు
- మార్చి నాటికి ఏర్పాటు
- 37 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- సైబర్ నేరాలపై డయల్ 1930
- జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్



కొవ్వూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కొవ్వూరు/చాగల్లు,డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మార్చి నాటికి 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు.కొవ్వూరురూరల్ సీఐ కార్యాలయం, చాగల్లు, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో గురువారం వార్షిక తనిఖీ నిర్వహించి మాట్లాడారు.జిల్లా పరిధిలో ట్రాఫిక్‌కు సంబంధించి 37 బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో నిద్ర మత్తు, సరైన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు.ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు ఫేస్ వాష్ వంటి కార్యక్రమాలు పెట్టామన్నారు. హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.జిల్లాలో 7 హైవే పెట్రోలింగ్ వాహనాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నల్లజర్ల నుంచి రాజానగరం వరకు హైవేపై 3 పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1800 నిఘా కెమెరాలు ఉన్నాయని.. 2025 మార్చి నాటికి జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. గతంతో పోల్చితే జిల్లాలో క్రైమ్ రేటు తగ్గిందన్నారు. జిల్లాలో మహిళల భద్రతకు మహిళా రక్షక్ అని వాట్సాప్ యాప్ ఏర్పాటు చేశామన్నారు. హత్యచోరీ కేసుల్లో ఉన్నవారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామన్నారు. డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సర వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. మద్యం షాపులు, బార్లు నిర్దేశిత సమయానికి మూసివేయాలన్నారు.రాత్రి సమయాల్లో మద్యం సేవించి తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బైక్‌ల సైలెన్సర్లు తీసి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా తిరిగితే చర్యలు తప్పవన్నారు. సైలెన్సర్ల డ్రైవ్ చేపడతామన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్నవారు, గతేడాది కోడి పందాల్లో పట్టుబడిన వారిని ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామన్నారు. గంజాయి నివారణకు అందరూ కలిసి పోరాడదామన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టు అంటున్నారు, అటువంటిది ఏమీ లేదన్నారు. సైబర్ సమస్య వస్తే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగినా 112 నెంబరుకు సమాచారం అందజేయాలన్నారు. కొవ్వూరురూరల్ సీఐ కార్యాలయం భవనం పాతది కావడంతో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదన చేస్తున్నామన్నారు. జిల్లాలో పోలీస్ స్టేషన్ల విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థలం సేకరించి సొంత భవనాలు నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. ఆయన వెంట సీఐలు కె. విజయ్ బాబు, పి.విశ్వం,ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐలు కె.శ్రీహరిరావు, కే.నరేంద్ర పాల్గొన్నారు.

నేడు ఏలూరులో ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఏకసభ్య కమిషన్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడానికి నియమించబడిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించారు.ఈ మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత ఉపసంచాలకులు ఎంఎస్ శోభారాణి ఒక ప్రకటన విడుదల చేశారు.కమిషన్‌కు వినతులను ఒరిజనల్ పత్రాలతో ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి మీటింగ్ హాలులో ఉదయం పది గంటలకు ఏకసభ్య కమిషన్‌కు సమర్పించవచ్చని శోభారాణి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



అరుణ పతాకం ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

దేశ రాజకీయాల్లో సీపీఐది కీలక పాత్ర

నిడదవోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాన్పూరులో 1925 డిసెంబరు 26న పురుడు పోసుకున్న భారత కమ్యునిస్టు పార్టీ దేశ రాజకీయాల్లో నిర్వహించిన పాత్ర ఎంతో గర్వించదగినదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాముడూరి నాగేంద్ర వరప్రసాద్ అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిడదవోలు మండలం శెట్టిపేట లో పార్టీ స్తూపం వద్ద అరుణ పతా కం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలబడ్డారని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. దేశంలో బ్యాంకుల జాతీయకర ణకు, భూసంస్కరణల అమలుకు, దేశ సమైఖ్య త సంరక్షణకు సీపీఐ పోరాడిందన్నారు. కార్యక్ర మంలో మండల కార్యదర్శి క్రొవ్విడి పెదనాగ రాజు, ఖండవల్లి మాణిక్యం, క్రొవ్విడి మస్తాన్, పెంటపాటి ప్రకాశం, క్రొవ్విడి అనిల్, కోసూరి శ్రీను, రొంగల శ్రీను తదితర్లు పాల్గొన్నారు.



విలీన సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా హక్కుల పోరాటానికి ఏకం కావాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం పోరాడే శక్తులన్నీ ఏకం కావలిసిన సమయం ఆసన్నమయ్యిందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న జరిగే సీపీఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ రెండు పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని ముద్రించిన పోస్టర్‌ను గురువారం కొవ్వూరులో ఆవిష్కరించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పనిచేసే విప్లవ పార్టీలు మరిన్ని ఐక్యం కావలిసిన అవసరం ఉందన్నారు. దేశంలో కార్పొరేట్ నాగ సర్పం కుబుసం విప్పి ప్రజల జీవనంపై బుసలు కొడుతూ కాటు వేస్తోందన్నారు. దీంతో బడుగు, బలహీనవర్గాల ప్రజల రాజ్యం కోసం పోరాటం చేసే శక్తులు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక, నాగమణి, బాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దివీస్ ప్రతినిధులు

ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాలలో దివీస్ లాబరేటరీ హెచ్ఆర్ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో దివీస్ హెచ్ఆర్ ప్రతినిధులు అప్ప సాని రాజేష్, పోతు రామకృష్ణ. బీఎ స్సీ, ఎమ్మెస్సీ, ఎం-ఫార్మసీ, బి-ఫార్మసి, బీటెక్ విద్యార్థులను ఇంటర్వ్యూ చేశా రు. దివీస్ ప్రతినిధి రాజేష్ కంపెనీ విధి విధానాలను వివరించారు. తమ కళాశాలలో విద్యతో పాటు ఉద్యోగ కల్పన అందించాలని ఉద్దేశ్యంతో క్యాం పస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కె.సూరిబాబు, ఉభయ గోదావరి, అల్లూరి జిల్లాలు నుంచి 54 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు.

ప్రియురాలిని మర్చిపోమన్నారని..

» రాజమహేంద్రవరం యువకుడు కొవ్వూరులో ఆత్మహత్య

» రైలు కిందపడి బలవన్మరణం



కొవ్వూరులో రైలు పట్టాలపై మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్టు నిడదవోలు రైల్వే పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం డీమార్టు పరిసర ప్రాంతానికి చెందిన బైరి నవీన్ లక్ష్మణరావు(25)కు తల్లిదండ్రులు లేరు. ఇద్దరు అన్నయ్యలతో కలిసి నివసిస్తున్నాడు. ఇటీవల ఒక అమ్మాయిని ప్రేమించాడు. అన్నయ్యలు ఆ అమ్మాయిని మర్చిపోవాలని సూచించడంతో మనస్థాపం చెంది కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని వేములూరు అండర్ టన్నెల్ వద్ద గురువారం గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

కాలువలో పడి బాలుడి మృతి

బల్లిపాడులో విషాదం

తాళ్లపూడి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఓ బాలుడు మృతిచెందాడు.మండలంలోని బల్లిపాడు గ్రామంలో కాలువ గట్టును ఆనుకుని ఉండే ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తలపాకుల ఝాన్సీ రాణికి ముగ్గురు సంతానం. చిన్నవాడైన తలపాకుల అద్విత్‌కుమార్(4) అంగన్‌వాడీ సెంటరు నుంచి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చాడని,తర్వాత ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మునిగి మృతిచెందాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.తన భర్త కరోనా సమయంలో మృతిచెందగా,ఇప్పుడు చిన్న కుమారుడు చనిపోయాడంటూ కన్నీరుమున్నీరవుతోంది. ఎస్సీ ఏరియా గుండా పంట పొలాలకు వెళ్లే కాలువ ప్రమాద భరితంగా మారింది. కాలువ నీరు ఆ ప్రాం తంలో భూమికి సమాంతరంగా ప్రవహిస్తోంది. కాలు జారినా మునిగిపోయే ప్రమాదముందని, ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా కాలువ గట్టు వద్ద రక్షణ ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు అధికారులు విన్నవించుకున్నామని స్థానికులు బంధువులు ఆరోపిస్తున్నారు.బాలుడి మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలు ముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని కొవ్వూరు ప్రభు త్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి

» ఎమ్మెల్యే ముప్పిడి

» కుమారదేవం పంపింగ్ స్కీమ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కుమారదేవం పంపింగ్ స్కీమ్ పాలకవర్గంతో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కుమారదేవం పంపింగ్ స్కీమ్ నూతన పాలకవర్గ సభ్యులు రైతులు సంక్షేమానికి పాటుపడాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం పంపింగ్ స్కీమ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడిగా గొరిజాల సురేష్, ఉపాధ్యక్షులుగా యనమదల శివరామకృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా జీవీవీ సత్యనారాయణ ప్రసాద్, మరో ఎనిమిది మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంటలు పండిస్తేనే ప్రతిఒక్కరికి అన్నం దొరుకుతుందని, టీడీపీ ఆవిర్భావం నుంచి రైతు సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

చాగల్లు, డిశంబరు 26, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హెల్త్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘ నాయకులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కోరారు. ఈ మేరకు బ్రాహ్మణగూడెంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నామని, ముగ్గురు ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 సంవత్సరాల పాటు ఉద్యోగం చేసి వీధిన పడిన హెల్త్ అసిస్టెంట్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘ నాయకులు రాజశేఖర్, డీవీ రామకృష్ణ కోరారు.

పగటి కలలు కనొద్దు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సినిమా హీరోలను చూసి పగటి కలలు కంటే భవిష్యత్ నాశనమవుతుందని ఆధ్యాత్మిక గురువు సత్యగోపీనాథ్ దాస్ అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్ భాష్యం జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస స్ఫూర్తి సదస్సులో మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులపై భక్తి ఉండాలన్నారు.

ప్రపంచ తెలుగు రచయితల

మహాసభకు 'తరపట్ల'

దివాన్‌చెరువు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరగనున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల సభలకు తాను విశిష్ట అతిథిగా హాజరవుతున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ సదస్సు ఈ నెల 28, 29 తేదీల్లో జరుగుతుందని, తాను విద్యా రంగ ప్రతినిధుల సభలో పాల్గొని కనుమరుగవుతున్న మన జానపద కళా సంపద పరిరక్షణ-ప్రణాళికలు అనే అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. ప్రపంచీకరణ ప్రభావంతో మన సంస్కృతీ సంప్రదాయాల్లో మార్పు వచ్చిందని, ఈ క్రమంలో తెలుగు కూడా అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరిపోయిందని, కళలు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వేదికల మీద మన గొంతు వినిపించాలని, అదొక గొప్ప సందేశం కాగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కరెంటు చార్జీల పెంపుపై

నేడు వైసీపీ పోరుబాట

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీల పెంపుపై వైసీపీ పోరుబాట కార్యక్రమాన్ని ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంటు చార్జీలను పెంచబోమని చెప్పి నేడు రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం కొవ్వూరు విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, కంఠమణి రమేష్, చెల్లింకుల మల్లేశ్వరరావు, తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, పోసిన శ్రీలేఖ పాల్గొన్నారు.

పంచాయతీలు వర్మీకంపోస్టు

తయారు చేయాలి

ఉండ్రాజవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలని శానిటేషన్ మండల కోఆర్డినేటర్ కె.ప్రకాశ్ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో డంపింగ్‌యార్డు షెడ్లను ఆయన పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్త ద్వారా సంపదను తయారు చేసుకోవచ్చని చెప్పారు. పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న తడి చెత్త, పొడి చెత్తను డంపింగ్ యార్డుల వద్ద వేరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పైడిమెట్టలో క్రిస్మస్ వేడుకలు



విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ప్రమోద్‌కుమార్

తాళ్లపూడి, డిసెంబరు 27: మండలంలో పైడిమెట్ట గ్రామంలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ప్రత్తిపాటి నిస్సీ సాగర్‌కు తాళ్లపూడి విజేత పాఠశాల ప్రిన్సిపాల్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. సంఘస్తులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీ

కొవ్వూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాల దొంగతనంపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. స్థానిక చిట్టూరి వారి వీధికి చెందిన మోదుగ శ్రీనివాస్ ఈ నెల 20వ తేదీ రాత్రి తన సుజుకి యాక్సిస్ మోటారుసైకిల్‌ను ఇంటిముందు పార్క్ చేశాడు. ఉదయం చూసేసరికి కనిపించక పోవడంతో వెతికాడు. దొరకకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై హెచ్‌సీ ఆర్.సాంబమూర్తి కేసునమోదు చేశారు. అలాగే విజయవాడ నరసింహ ఎన్క్లేవ్‌కు చెందిన పఠాన్ శభాష్‌ఖాన్ ఈ నెల 15న కొవ్వూరు లక్ష్మీ కేఫ్ వద్ద రూ.2 లక్షల విలువైన డ్యూక్ మోటారుసైకిల్ పార్క్‌చేసి టిఫిన్ చేసి వచ్చేసరికి దుండగులు దొంగిలించుకుపోయారు. దీనిపై పట్టణ హెచ్‌సీ ఎం.సత్యనారాయణ కేసునమోదు చేశారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



దేవరపల్లిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత నేత వంగవీటి రంగా అని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా దేవరపల్లి, యర్నగూ డెంలో రంగా విగ్రహాలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, పూలమాలలతో నివాళులర్పించారు. దేవరపల్లిలో రంగా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు కాపు, వైసీపీ నాయకులు నివాళులర్పించారు. సువర్ణరాజు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటం చేసిన నాయకుడు రంగా అని ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో దుగ్గిన గంగాధర్, కవల శ్రీనివాసు, కామిశెట్టి దుర్గారావు, చప్పటి శివనాగప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, పసుపులేటి ప్రసాద్, బళ్లా రాము పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని కాపుల వీధిలో వంగవీటి మోహన రంగ విగ్ర హానికి పలువురు పూలమా లలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, రంగా రమేష్, తిరుపతి సత్యనారా యణ, అజీజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో చివటం, తాడిపర్రు, ఉండ్రాజవరం గ్రామాల్లో వంగవీటి రంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. చివటంలో కృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాసరి మునిరాజు, అబ్బిరెడ్డి శివ, గంటిన చినవెంకన్న, కూనపరెడ్డ అంజి, ప్రసాద్, పంజా శ్రీను, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.



నిడదవోలులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



కుమారదేవం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: రైతులు, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని కొండగూడెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూమి రీసర్వే, ఇతర సమస్యలపై ఏడు అర్జీలు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. వీటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కొండగూడెంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాముకాటు..రైతు మృతి

నిడదవోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందినట్లు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన పుట్ట సత్యనారాయణ (62) గురువారం ఉదయం పశువుల కోసం గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా నిలుపుల చేస్తామని.. వినియోగ దారులు సహకరించాలని విద్యుత్‌శాఖ నిడదవోలు ఈఈ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు.యర్నగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుంద న్నారు.యర్నగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో యర్నగూడెం, త్యాజంపూడి, గాంధీ నగరం, సంగాయిగూడెం గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రిస్మస్ పండుగ పూట పాస్టర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాస్టర్‌పై పోక్సో కేసునమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ దేవదాసు కుటుంబరావు ఈ నెల 25వ తేదీ ఉదయం మండలంలోని ఓ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఎవ్వరూ లేని సమయంలో వెళ్లి 11 ఏళ్ల బాలికను.. ఎవరైనా ఉన్నారా అంటూ లోపలికెళ్లి సాయంత్రం క్రిస్మస్ పార్టీకి వస్తామని చెబుతూ బలవంతంగా బాలికను కౌగిలించుకుని, పలుచోట్ల చెయ్యి వేసి ముద్దు పెట్టుకున్నాడు. బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయడంతో కుటుంబ సభ్యు లు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ప్రాథమిక వైద్య సేవల్లో పీఎంపీలు కీలకం

పీఎంపీల వ్యవస్థాపక దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్26(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రాథమిక వైద్య సేవలందిస్తున్న పీఎంపీల పాత్ర సమాజంలో కీలకమని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా ఆధ్యర్యంలో రెడ్డీస్ కన్వెన్షన్ హాల్‌లో పీఎంపీల 62వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నిర్వహించారు. అధునాతన వైద్య విధానాలు, ప్రోస్టేట్ సమస్యలపై చర్చించారు. రాజేంద్రనగర్‌లోని జిల్లా సంఘ కార్యాలయం వద్ద వ్యవస్థాపకుడు స్వర్గీయ ఆర్కే భరద్వాజ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలికి చెందిన డాక్టర్ ఎన్ఎల్‌రావు, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జాతీయ కార్యదర్శి వీబీటీ.రాజు,తోరాటి ప్రభాకరరావు,గంగుమళ్ళ రాంబాబు తదితర పీఎంపీలు పాల్గొన్నారు.

మతోన్మాదంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద నినాదంతో ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయం, కూరగాయల మార్కెట్, అపరాల మార్కెట్, కొత్తపేట, క్వారీ మార్కెట్ సెంటర్ ప్రాంతాల్లో గురువారం సీపీఐ శత వార్షికోత్సవాల జెండా ఆవిష్కరణలు జరిగాయి. మధు మాట్లాడుతూ మతోన్మాద శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదల పక్షాన నిలిచి పోరాడేది సీపీఐ పార్టీయే అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, నగర కార్యవర్గసభ్యులు నల్ల రామారావు, సేపేని రమణమ్మ, సిడగం నౌరోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను తప్పించబోయి వంతెన పైనుంచి పడిపోయిన యువకుడు

» ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

» పండక్కి దుస్తులు కొనుక్కొనేందుకు ద్వారపూడి వెళ్తుండగా ఘటన



ప్రేమ్‌కుమార్ మృతదేహం

మండపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి మోటారుసైకిల్‌పై వెళ్తూ ఓ యువకుడు ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందపడి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. కోనసీమ జిల్లా మండపేట రూరల్ పోలీసులు కథనం ప్రకారం.. మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన గానుగుల ప్రేమ్‌కుమార్(17) గురువారం పండక్కి బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి వద్ద బైక్‌తీసుకుని బయలుదేరాడు. ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనపై ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందకు పడిపోగా బైక్ వంతెనపై ఉండిపోయింది. ప్రేమ్‌కుమార్‌ను ద్వారపూడి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మండపేట ప్రభుత్వాస్పత్రికి. అక్కడినుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రేమ్‌కుమార్ తండ్రి చాలాకాలం క్రితం మృతి చెందాడు. తల్లి గంగాభవాని వద్ద కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కూమారుడు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది.

పాడుబడిన థియేటర్ పైనుంచి పడి..

గుర్తు తెలియని యువకుడి మృతి



అమలాపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎక్కడి నుంచి వచ్చాడో.. ఎలా వెళ్లాడో తెలియదు గానీ.. దశాబ్దాల కాలం క్రితం అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో మూసివేసిన హనుమాన్ థియేటర్‌లోకి గురువారం గుర్తు తెలియని యువకుడు వెళ్లాడు. శిథిలావస్థలో ఉన్న భవనంపైకి చేరుకుని అక్కడినుంచి పడిపోయాడు. అతడిని 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తు తెలియని యువకుడి సమాచారం కోసం సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర జిల్లాల అధికారులకు సమాచారం అందించినట్టు అమ లాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.